
వార్త
ఆదివారం
22 అక్టోబరు, 2023
దుర్గే..దేవీ
నమోస్తుతే
సంబురాల 'సద్దుల బతుకమ్మ'

## తారాతీరం


# 'డ్యూయెట్'లో వైష్ణవి చైతన్య!



'బేబి' సినిమాతో వైష్ణవీ చైతన్య స్టార్ డమ్‌ను సంపాదించుకుంది. ఈ సినిమా తరువాత ఆమెను వరుస ఆఫర్లు చుట్టుముట్టాయి. తనకి నచ్చిన కథలను ఎంచుకుంటూ వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఆనంద్ దేవరకొండ జోడీగా 'డ్యూయెట్' సినిమా ఒప్పుకున్నట్లు సమాచారం.

ఆనంద్ దేవరకొండ హీరోగా మిథున్ అనే యువకుడు ఒక ప్రేమ కథా చిత్రాన్ని రూపొందించడానికి సిద్ధమవుతున్నాడు. ఇందులో కథానాయిక పాత్ర కోసం వైష్ణవీచైతన్య ఎంపికైనట్లు తెలుస్తోంది. ఇది యూత్ ఫుల్ లవ్ స్టోరీ అని తెలుస్తోంది. ఈ సినిమా దసరాకి లాంఛనగా ప్రారంభించనున్నట్లు తాజా సమాచారం.

# మల్టీ స్టారర్ సినిమాలో చైతూ?



వెంకటేశ్ ప్రస్తుతం 'సైంధవ్' సినిమా షూటింగులో బిజీగా ఉన్నారు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమాకి శైలేశ్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం జనవరిలో విడుదల కానుంది. ఈ ప్రాజెక్ట్ తర్వాత సుధాకర్ రెడ్డి దర్శకత్వంలో ఆయన సినిమా చేయనున్నట్లు సమాచారం.

స్టూడియో గ్రీన్ బ్యానర్‌వారు ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇది మల్టీ స్టారర్ సినిమా అని తాజా సమాచారం. ఇందులో మరో హీరో పాత్రకి చైతూను తీసుకున్నట్లు సమాచారం. 'వెంకీమామ' తరువాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న మరో చిత్రమిది. చందూ మొండేటి ప్రాజెక్టుతో చైతూ బిజీగా ఉన్నాడు. ఆ తరువాత వెంకీ ప్రాజెక్టులో జాయిన్ అవుతాడని సమాచారం.

ఆదివారం వార్త

22 అక్టోబరు, 2023

## మంచి ముత్యాలు

ఒక సవాలు ఎదురైతే నీలోని అహం ఎలా
స్పందిస్తుందో నిర్ణయించేది నీ మనసు యొక్క నాణ్యత

- స్వామి చిన్మయానంద

## విషయ విశేషం

విదేశాల్లో 'లా' చదువు... 4

'సంఘీ'భావం....5
ఓటరు విజ్ఞతకు పరీక్ష

కవర్ స్టోరీ..6
దుర్గే..దేవీ
నమోస్తుతే

ఏ వీధిలో చూసినా పుస్తకాలే..11

ఈవారం కవిత్వం..12
రసోజ్వల

సంబురాల 'సద్దుల బతుకమ్మ'..18

కథ.. 20
తీపి ప్రియులు

ఆనందంగా జీవించడమూ ఓ కళ..23

హిమాలయాల ఔన్నత్యం...25

తూర్పు ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?...29


ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### కాఫీతో మతిమరుపు మాయం!



కాఫీ మంచిదా కాదా అన్నది పక్కనపెడితే, పెద్దవయసులో కాఫీ తాగితే ప్రయోజనమే అంటున్నాయి తాజా పరిశోధనలు. ఇందులోని బయోయాక్టివ్ పదార్థాలు గ్రాహ్యకశక్తినీ జ్ఞాపకశక్తినీ పెంచుతాయి అని చెబుతున్నారు జపాన్‌లోని సుకుబా యూనివర్సిటీ పరిశోధకులు. కాఫీలోని ట్రిగోనెలిన్ (టీజీ) అనే ఆల్కలాయిడ్, నాడీకణాల్ని సంరక్షిస్తుందనీ తద్వారా మెదడుకు త్వరగా వృద్ధాప్యాన్ని దూరం చేస్తుందనీ వారు తెలిపారు. సాధారణంగా కాఫీ గింజల్ని వేయించినప్పుడు ట్రిగోనెలిన్ పదార్థం నికోటినిక్ ఆమ్లంగా మారుతుంది. ఈ ఆమ్లానికి నాడీ వ్యవస్థనీ జీర్ణవ్యవస్థనీ చర్మాన్నీ సంరక్షించే గుణాలు ఉన్నాయి. అయితే ఈ ట్రిగోనెలిన్ పదార్థానికి స్వతహాగానే ఔషధగుణాలు ఉన్నాయట. దాంతో కాఫీ గింజల నుంచి ఈ పదార్థాన్ని సేకరించి ముసలి ఎలుకలకు 5గ్రా, చొప్పున ముప్ఫై రోజులపాటు ఇచ్చి



పరిశీలించినప్పుడు వాటికి మతిమరుపు తగ్గినట్లు గుర్తించారు. ఇది న్యూరోట్రాన్స్ మిట్టర్లను ప్రేరేపించి హిప్పోక్యాంపస్ పనితీరును పెంచుతున్నట్లు వాళ్ల పరిశోధనలో తేలింది. కాబట్టి మతిమరుపుతో బాధపడేవాళ్లకి దీన్ని సప్లిమెంట్ రూపంలో ఇస్తే ఫలితం ఉంటుందనీ భావిస్తున్నారు.

---

భార్య: వాక్సిన్ వేయించుకున్నారా? బాగా నొప్పిగా ఉందా?
భర్త: ఆ వాక్సిన్ వేయించుకున్న,పెద్దగా నొప్పి లేదులే.
భార్య: ఎందుకు ఉంటుంది? పరాయి ఆడది పెద్ద సూది గుచ్చినా మీకు నొప్పి ఉండదు. అదే నేను చిన్న మాటంటే మాత్రం మీకు ఎక్కడ లేని నొప్పి వస్తుంది.
భర్త: అదేంటే అంత మాట అంటున్నావు?
భార్య: ఉన్నమాటే అంటున్నా..

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# విదేశాల్లో 'లా' చదువు

ఈ.ఎస్.మాధవన్

**విదేశాలలో చదువుకోవాలనే ఆశ నేటి యువతరానికి బాగా పెరిగింది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు విదేశాల్లో ఉన్నత చదువులు చదివి, గొప్పగా స్థిరపడాలని తపిస్తు న్నారు. విదేశాలలో చదువులు అనేసరికి మనకి గుర్తుకు వచ్చేవి ఇంజినీరింగ్, డాక్టర్, నర్సింగ్‌వంటివి. వీటి గురించి మనలో అందరికీ ఎంతో కొంత అవగాహన ఉంటుంది. అయితే లా కోర్సులు చదివేందుకు ఇతర దేశాలకు వెళ్లడం తక్కువే. కానీ ఒకప్పుడు బారిష్టర్ చదివేందుకు ఇతర దేశాలకు వెళ్లేవారు. ఉదాహరణకు జాతిపిత గాంధీ, మన తెలుగులో బారిష్టర్ పార్వతీశం అనేవారు మనకు ఆదర్శం.**

ఒకప్పుడు విదేశాల్లో లా చదవడం అంటే చాలా గొప్ప. ఒక దేశం నుండి మనం లా చదువుకుని మరో దేశంలో ఉద్యోగం చేయడం అంత సులువు కాదు. విదేశాలలో అన్నిచోట్ల న్యాయ విధానాలు ఒకేలా ఉండవు. మనదేశంలో లా చదువుకుని వేరే దేశంలో మనం ఉద్యోగం త్వరగా చేయలేం. అలాగే అమెరికాలో లా చదువుకుని రష్యాలో ఉద్యోగం చేయలేం. దానికి కారణం న్యాయశాస్త్రం మనుష్యులు రచించారు. వారివారి మనోభావాలకు అనుగుణంగా ఒక దేశంలో ఒప్పు మరో దేశంలో తప్పు కావచ్చు. ఒకే తప్పు రెండు వేరువేరు దేశాలలో శిక్షలు రెండురకాలుగా ఉంటాయి. ఒక చోట శిక్ష సులువుగా ఉంటే మరో చోట చాలా కఠినంగా ఉంటుంది. మనదేశంలో న్యాయశాస్త్రం చదవడం వేరే దారిలేకపోతేనే కారణం. జూనియర్ లెవెల్లో మనదేశంలో ఆర్థికంగా మంచి పరిస్థితులు లేవు. అందుకే చెట్లుకింద ప్లీడర్ అనేవారు.




నిజానికి ఇప్పుడు మనదేశం పరిస్థితి లాయర్లకు అనుకూలంగా ఉంది. అందుకే న్యాయస్థానాలలో ఎన్రోల్మెంటట్ లాయర్లకు ఎక్కువసార్ల చేస్తున్నారు. గతంలో సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే చేసేవారు.

ఇప్పుడు న్యాయశాస్త్రం చదవడానికి మన విద్యార్థు లు విదేశాలకి వెళ్తున్నారు. మరి విదేశాలలో లా చదవడానికి ప్రాక్టీస్ చేసేందుకు కావలసిన వివరాలు అందించేందుకు ఏజెన్సీలు, కౌన్సెలింగ్ సెంటర్లు చాలా ఉన్నాయి. వాటి సహాయంతో ఎక్కడ చదవాలి అని మనం తెలుసుకోవడం ముఖ్యం.

న్యాయవిద్య అభ్యసించడానికి ఆయాదేశాలలో నియమనిబంధనలు ఉన్నాయ్. ఎంట్రెన్స్ పరీక్షలు రాయాలి. దానికి అనుబంధ కోర్సులు పూర్తిచేయాలి. దీనికి ఒక ఉదాహరణ మనదేశంలో న్యాయవిద్య నేర్చుకుని గల్ఫ్‌దేశాలలో ఉద్యోగం చేయాలంటే వీలుపడదు. ముందుగా అక్కడి అరబిక్‌భాష నేర్చుకోవాలి. చట్టాలు కూడా తెలుసుకోవాలి. మనదేశంలోని ఇండియన్ పీనల్ కోడ్‌లోని 420 సెక్షన్ బ్రిటిష్ సామ్రాజ్యంలోని నియమం ఇంచుమించు ఒకేలా ఉంటుంది. మరి అదే సింగపూర్ లోని 420 వేరేగా ఉంటుంది. మరి అందుకే ఆయా దేశాలలోని న్యాయవిద్య నేర్చుకోవడం రిజిస్ట్రేషన్ చేయడం వంటివి తప్పనిసరిగా అనుసరించాలి. మరో ఉదాహరణ ఆస్ట్రేలియాలో లా ప్రాక్టీస్ చేయడానికి అక్కడి అడ్మిటింగ్ అథారిటీ ద్వారా అసైన్‌మెంట్ జరగాలి. ది లా అడ్మిషన్స్ కన్సల్టేటివ్ కమిటీ నియమాలకు అనుగుణంగా ఉండాలి. కెనడాలో నేషనల్ కమిటీ ఆన్ అక్రెడిషన్ ద్వారా, ఇంకా ఇంగ్లండ్ వెల్స్‌లో సొలిసిటర్‌గా సాగాలంటే సొలిసిటర్స్ క్వాలిఫైయింగ్ ఎక్సమినేషన్ రాయాలి. అమెరికాలోని జ్యూరిస్ డాక్టర్ బిరుదు పొందాలి. ది లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ పొందాలి. లా చదవడం ఉత్తమం. దీనివలన క్లయింట్లుగా వ్యక్తులు కారు దేశాలు కూడా ఉంటాయి. యుద్ధం సరిహద్దు గొడవలు వ్యాపారం వంటివి ఇరుదేశాల మధ్య అభిప్రాయ వ్యత్యాసాలు ఉంటాయి. అవి తీర్చడానికి ఇంటర్నేషనల్ లా ఉపయోగకరం. అలాగే ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్‌లో కూడా న్యాయబిరుదు పొందినవారికి అవసరాలు ఎక్కువ. న్యాయ స్థానాలలో సమయం ఎక్కువ. అటువట్టపుడు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవడం జరుగుతుంది. ఇటువంటప్పుడు నియమాలకన్నా సామరస్యభావానికి విలువ కల్పిస్తారు. జనీవా విశ్వవిద్యాలయం, జనీవా గ్రాడ్యుయేట్ ఇన్స్టిటూట్ సెటిల్‌మెంట్ గొప్ప కోర్సు. స్విట్జర్లాండ్‌లోని వరల్డ్‌ట్రేడ్ ఇన్స్టిట్యూట్ కూడా మంచి సంస్థ. పేరు డబ్బు సంపాదించాలంటే ఇంటర్నేషనల్ లా చదవడం మంచి మార్గం. ❑

# 'సంఘీ' భావం



# ఓటరు విజ్ఞతకు పరీక్ష

రాబోయే ఎన్నికలు ఓటరు విజ్ఞతకు సవాల్‌గా మారను న్నాయి. గతంలో జరిగిన ఎన్నికల కంటే ఈసారి అంతుచిక్కని ప్రలోభాలతో పాటు భారీ ఎత్తున డబ్బు, మద్యం వంటివి సరఫరా చేయడానికి అభ్యర్థులు సర్వసిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన వెనువెంటనే డబ్బు, బంగారం, మద్యం సీసాలు తరలించే కార్యక్రమం చేపట్టారు. పోలీసులు, ఎన్నికల అధికారుల తనిఖీల్లో కోట్లాది రూపాయల నగదు, కేజీల కొద్దీ బంగారం పట్టుపడుతోంది. వాస్తవానికి ఎన్నికల ప్రకటనకు ముందే డబ్బు, బంగారం, మద్యం సీసాలు చేరాల్సి న చోటుకు చేరిపోయాయి. ఇక ఎన్నికల సమయంలో వీటిని పంచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఐదేళ్లకు ఒకసారి ఓటరు ముందుకు వెళ్లి పాదాభిషేకం చేసి, అతని అవసరాలు తీర్చడం ద్వారా ఓట్లను రాబట్టేందుకు మెజారిటీ అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. సిద్ధాంతాలు, ప్రజాహితం, సంక్షేమం వంటివి పక్కన పెట్టి వ్యూహకర్తల సహకారంతో ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో వాటిని అన్వేషిస్తున్నా రు. అడ్డదారిలో ఎలాగైనా చట్టసభలకు ఎంపిక అయితే చాలన్న దృక్పథం చాలామంది అభ్యర్థుల్లో కనబడుతోంది. ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్న వారు తాము తమ హయాంలో అభివృద్ధిని ఓటర్ల ముందు పెట్టి ఓట్లు అడగాల్సి ంది పోయి మభ్యపెట్టి ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు అభ్యర్థులు వంద నుంచి మూడు వందల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓటర్లకు 5 నుంచి పదివేల వరకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మద్యం ఏరులై పారేందుకు సిద్ధంగా ఉంచారు. ఎన్నికల అధికారులు అక్రమాలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయినా అంతకు మించిన వ్యూహంతో పార్టీ పెద్దలు అడ్డదారులు తొక్కేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం లెక్కకు మించి ఖర్చు చేయకూడదు. అయితే వందల కోట్లు ఖర్చు పెట్టి విజయం సాధించేందుకే మెజారిటీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే కులాల వారీగా, ప్రాంతాల వారీగా ఏమేరకు చెల్లించాలో లెక్కలు సిద్ధం చేసుకున్నారు. డబ్బు, మద్యం ఇవ్వడం ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చాలామంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉంది. దీనితో ప్రత్యర్థులు తాము విజయం సాధించేందుకు ఎక్కువ మొత్తంలో డబ్బు పంపిణీ చేయాలన్న ధ్యాసలో ఉన్నారు. ఇక తాజా మాజీలు మళ్లీ పదవిలో కొనసాగించేందుకు ప్రత్యర్థులకు మించి ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. దీనితో ఎన్నికల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారింది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తాము చేసిన సేవా కార్యక్రమాలను ఓటర్లకు తెలియజేసి ఓట్లు అభ్యర్థించే విధానాన్ని స్వస్తిపలికారు. కేవలం డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల ద్వారా ఓట్లను సాధించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. నిస్వార్థంతో సేవా గుణంతో పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. సేవలు అందించే నాయకులు డబ్బు ఖర్చు పెట్టలేకపోతున్నారు. దీనితో వీరు క్రమంగా రాజకీయ రంగం నుంచి తప్పుకుంటున్నారు. కేవలం డబ్బును వెదజల్లే వారు ఎన్నికల రంగంలో పోటీ పడి చట్టసభలకు వెళుతున్నారు, వీరి లక్ష్యం సేవా భావం కంటే ఆదాయ సముపార్జనే ఉండటంతో నిరుపేదల సమస్యలు పట్టించుకోవడం లేదు. టిఎన్ శేషన్ ఎన్నికల కమిషనర్‌గా పనిచేసినప్పుడు ఎన్నికల సంఘం సత్తా ఏమిటో చూపించగలిగారు. అప్పటి నుంచి ఎన్నికల సంఘం విధినిర్వహణలో స్పష్టమైన మార్పు కనిపించింది. ప్రస్తుతం కూడా ఎన్నికల సంఘం ఆధీనంలోకి వచ్చిన వెంటనే అధికారపార్టీకి అండగా ఉండే సీనియర్ ఐపిఎస్, ఐఎఎస్ అధికారులను బాధ్యతల నుంచి తప్పించారు. ఇలాంటి చర్యల వల్ల ఓటర్లలో ఎన్నికల పట్ల నమ్మకం, నిక్కచ్చిగా విధులు నిర్వహించే అధికారులకు ధైర్యం వస్తుంది. ఇదే సమయంలో ఓటర్లు కూడా విజ్ఞతతో వ్యవహరించాలి. ఓటు కోసం డబ్బు తీసుకోవడం కంటే సమర్థుడిని గెలిపించి తమ ప్రాంతాలు అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదిగే పరిస్థితులు కల్పించుకోవాలి. ముఖ్యంగా యువత ముందుకు వచ్చి ఓటు ప్రాధాన్యతను వివరించి సామాన్య ఓటర్లలో చైతన్యం వచ్చే విధంగా కృషి చేయాలి. 5 సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే ఓటరు మహా రాజుగా పిలిపించుకునే అవకాశం కలిగిన ప్రజలు సరైన రీతిలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటే ఐదేళ్ల మహారాజుగా జీవించవచ్చు. అలా కాకుండా అభ్యర్థులు ఇచ్చే వెయ్యి, రెండు వేలకు లొంగిపోతే జీవితాంతం మనోవేదన తప్పదు. తమ ప్రాంతాల అభివృద్ధికి, భావి తరాల అభ్యున్న తికి బాటలు వేయాలంటే ఓటు ద్వారానే సాధ్యం అవుతుంది. ఆ విషయాన్ని ప్రజలు గ్రహించాలి. అంతే కాదు పోలింగ్ నాడు సెలవు కాబట్టి స్వంత పనులు చక్కబెట్టుకు నేందుకు ప్రయత్నించకుండా ఉదయాన్నే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఆ ఓటును సరైన అభ్యర్థికి వేయాలి. అప్పుడే ఆశించిన ప్రగతి, అభివృద్ధి సాధ్యపడుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

దసరా అనగానే ముందు గుర్తొచ్చేది పెద్ద పండుగ అని, అమ్మవారి పూజలు. ఇంకా బొమ్మల కొలువులు, దాండియా ఆటలు.. ఓహ్! ఒకటేమిటి.. అనేకం. మరి పండుగ వస్తోంది కదా. ఇల్లు శుభ్రం చేసుకుని అమ్మవారి పూజలకు అన్నీ సిద్ధం చేసుకున్నట్లు, అసలు మన చుట్టుపక్కల ఎవరేం చేస్తున్నారో.. పండుగ ఎలా చేసుకుంటున్నారో.. ఓ

# దుర్గే..దేవీ నమోస్తుతే




కన్నేయొద్దూ!? పక్కిం టావిడ పట్టుచీర కన్నా మన కాటన్ చీర డిజైనూ, రంగూ డాబుగా వుందని అందరూ మెచ్చుకోవద్దూ! మరి పదండి. ముందు మన చుట్టూ అంతా ఏం చేస్తున్నారో ఓసారి చూసి తర్వాత మనమేం చెయ్యాలో మనకెటు తెలుసుగా.

**కవర్ స్టోరీ**

**పి.యస్.యమ్.లక్ష్మి**

ఈ కాలం పిల్లలు మన పండగలు, ఆచారాల గురించి పట్టించుకోవటం లేదని పెద్దలు వాపోతున్నారు. అందుకే ముందుగా ఈనాటి యువత కోసం పండగ ఎప్పుడు జరుపుకుంటారో, ఎందుకు జరుపుకుంటారో చెప్తాను.

ఇది ఆశ్వీయుజ మాసంలో శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు అంటే తొమ్మిది రోజులు జరుపుకునే పండుగ ఇది. అందుకే కొందరు దీనిని పెద్ద పండుగ అంటారు. కానీ తెలుగువారు పెద్ద పండుగ అంటే సంక్రాంతి అంటారు. భిన్న ప్రాంతాలు, భిన్న అభిప్రాయాలు. ఇన్ని రోజులు ఏం చేస్తారు అంటారా? దీనికంటే ముందు ఈ పండగ ఎందుకు చేస్తారో తెలుసుకుందాం.

పూర్వం మహిషుడనే రాక్షసుడు ఉండేవాడు. ఈయన ఘోర తపస్సు చేసి, బ్రహ్మదేవుడి నుంచి తనకి ఎవరివల్లా మరణం లేకుండా వరం పొందాడు. ఆ సమయంలో స్త్రీలంటే వున్న చులకన భావంతో స్త్రీలు తననేం చెయ్యగలరనే అహంభావంతో స్త్రీల నించి కూడా అనకుండా నిర్లక్ష్యం చేశాడు. తర్వాత కథ మామూలే. వర గర్వంతో అందరినీ హింసలు పెట్టటం, దేవతలతో యుద్ధం చేసి, వాళ్ళని ఓడించి ఇంద్ర పదవి చేపట్టడం. అది భరించలేని ఇంద్రుడు త్రిమూర్తులను శరణు వేడటం వగైరా.

దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకోగా వారి నుండి వెలువడిన క్రోధాగ్ని ఒక ప్రకాశవంతమైన తేజంగా మారింది. ఆ తేజాలన్నీ కేంద్రీకృతమై ఒక స్త్రీ రూపంగా 18 చేతులతో సాక్షాత్కరించింది. ఆమె రాక్షసులతో యుద్ధం చేసే శక్తి పొందటానికిగాను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ముగ్గురమ్మలు, మిగతా దేవతలంతా కూడా తమ తమ శక్తులని, ఆయుధాలని ఆ మాతకి సమర్పించారు.

ఇలా సర్వ దేవతా శక్తుల ఆకారంగా, సర్వ దేవతల ఆయుధాలనీ సమకూర్చుకొన్న ఆ మహాశక్తి మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన యుద్ధం చేసింది. అమ్మవారు తొమ్మిది రోజులు మహిషుడితో యుద్ధం చేసి చివరికి అతనిని చంపింది. జగజ్జనని అయినా కూడా ఆ అమ్మ అతనిని జయించటానికి అన్ని రోజులు చాలా కష్టపడవలసి వచ్చింది. అమ్మ చేసిన ఈ ఘోర యుద్ధం చివరికి క్రూర రాక్షసుని అంతం వీటన్నింటికీ చిహ్నంగా చేసేదే ఈ పది రోజుల దసరా. తొమ్మిది రోజులు అమ్మవారికి పూజలు చేసి, పదవ రోజు అమ్మ రాక్షసుల మీద సాధించిన విజయానికి చిహ్నంగా 'విజయ దశమి' అత్యుత్సాహంతో జరుపుకుంటారు.

ఈ పండగని నవరాత్రి అనీ, శరదృతువు మొదట్లో వచ్చే పండుగ కనుక శరన్నవరాత్రి అని, అమ్మవారిని పూజిస్తారు కనుక దేవీ నవరాత్రులని కూడా అంటారు. ఈ సందర్భంగా బాల దగ్గర నుంచీ పెద్ద ముత్తయిదుదాకా రోజూ ముత్తయిదువులని అమ్మవారి రూపంగా గౌరవించి పూజిస్తారు.

తొమ్మిది రోజులు యుద్ధం చేసిన ఆ తల్లి వివిధ దేవతల ప్రతి రూపమే గనుక ఆలయాలలో ఈ తొమ్మిది రోజులూ రోజుకొక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేస్తారు.
దశమి రోజు విజయాన్ని సాధించిన విజయ దుర్గగా, రాజరాజేశ్వరీ దేవిగా అలంకరిస్తారు. ప్రాంతాలని బట్టి అమ్మవారి నామాలు, అలంకరణలు, నైవేద్యాలు మారుతుంటాయి. ఈ పది రోజులూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతూ వుంటాయి.



విజయ దశమికీ, రామాయణానికీ, భారతానికీ కూడా సంబంధాలున్నాయి. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు లంకకి వెళ్లేముందు శమీ వృక్షానికి పూజ చేసి వెళ్లాడని, అందుకే రావణుడి మీద విజయం సాధించాడని ఒక కథనం. పైగా రావణాసురుని సంహరించిన రోజు విజయ దశమి. అందుకనే ఆలయాలలో రావణాసురుని నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేసి, సాయంత్రం దానిని దహనం చేస్తారు.
ఇంక భారత కథనానికి వస్తే- అజ్ఞాత వాసానికి వెళ్లే ముందు పాండవులు తమ తమ ఆయుధాలని ఒక జమ్మి చెట్టు మీద దాచారని, అజ్ఞాత వాసం పూర్తయిన తర్వాత విజయ దశమి రోజు వాటిని తిరిగి తీసుకున్నారంటారు. ఆ సమయంలో ఇంద్రుడు పాలపిట్ట రూపంలో వాటిని కాపాడాడనే కథనం కూడా వుంది. అంత ప్రాముఖ్యం వహించిన జమ్మిచెట్టును ఈరోజు పూజించి, దాని ఆకులను బంగారమని అందరికీ శుభాకాంక్షలతో పంచే ఆచారం కూడా కొన్ని ప్రాంతాలలో వున్నది. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో వుంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజా స్థలంలో, ధన స్థానంలో, నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుందని నమ్మకం. దక్షిణాది రాష్ట్రాలలో శమీ పూజతో పాటు విజయదశమి రోజు పాలపిట్ట దర్శనం కూడా శుభ సూచకమనే నమ్మకం వుంది.

### ఆయుధ పూజ

ఈ నవరాత్రులలోనే ఆయుధ పూజ కూడా చేస్తారు. మహాశక్తి రాక్షసులతో యుద్ధం చేసి గెలిచినందుకూ, పాండవులు ఆయుధాలు తిరిగి తీసుకున్న గుర్తుగా, మహర్నవమి రోజున ఆయుధ పూజ(తాము వాడే పనిముట్లు, వాహనాలు వగైరా వాటికి) చెయ్యటం కూడా ఆనవాయితీగా వస్తోంది.

### సాంప్రదాయాలు

దసరా అనేక సాంప్రదాయాల కలపోతగా చేసుకునే సరదా పండగ అని చెప్పాను కదా. కొందరు ఈ పది రోజులూ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు (ముఖ్యంగా తమిళులు). మా చిన్నప్పుడు కొందరు వివిధ వేషాలతో వచ్చి వారి విద్యని ప్రదర్శించేవారు. పగటి వేషాలు అనేవాళ్లు.. పిట్టల దొర(కామా, ఫుల్‌స్టాప్ లేకుండా బడాయిలు చెబుతాడు). నూనె గుడ్డలవాడు (వంటి మీద ఎక్కువ గుడ్డలు నూనెతో తడిపినవి వేసుకుని వచ్చేవాడు). వారికి 'దసరా' మామూలు అంటూ కానుకలు ఇచ్చి పంపేవారు. స్కూలుపిల్లలు కూడా టీచర్లతో కలిసి ఇంటింటికీ తిరిగేవాళ్లు(ఇదొక రకమైన గురుపూజేమో.. అప్పుడు గురుపూజ గురించి మాకంతగా తెలియదు). 'అయ్యవారికి చాలు ఐదు వరహాలు, పిల్లవాళ్లకి చాలు పప్పుబెల్లాలు' అంటూ ఆ సమయంలో వెదురు కర్రతో చేసిన రంగు రంగుల కాగితాలంటించిన విల్లంబులు ధరించేవాళ్లు. పిల్లలకి తినటానికి ఏమైనా పెట్టేవాళ్లు, టీచర్లకి కానుకలు ఇచ్చేవారు. ఈ సంప్రదాయం ఇప్పుడు మరుగున పడ్డట్లు వున్నది కానీ దసరా మామూళ్లు ఇంకా వున్నాయి.

### వివిధ ప్రదేశాలలో దసరా

మరి ఈ పండుగ మన తెలుగు రాష్ట్రాలలోనే ఒక్కో ప్రదేశంవాళ్లు ఒక్కో విధంగా చేసుకుంటారు.

### తెలంగాణ

తెలంగాణలో దసరా సంబరాలే కాక అదే సమయంలోనే వచ్చే 'బతుకమ్మ పండుగ' కూడా చాలా పెద్ద పండుగ. ఒక పళ్లెంలో పువ్వులు గుండ్రంగా పేర్చి, దాని మీద పసుపుతో చేసిన అమ్మవారిని పెట్టి(బతుకమ్మ) సాయంకాలాలు మహిళలందరూ గుమికూడి దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. తెలంగాణ అంతటా దసరా తొమ్మిది రోజులూ జరిగే ఈ బతుకమ్మ పండుగ దుర్గాష్టమినాడు 'సద్దుల బతుకమ్మ' అని బతుకమ్మని నీటిలో వాలాడించటంతో ముగుస్తుంది.

### కరీంనగర్

దసరా సమయంలో కరీంనగర్ వాసులు అకాడాగా నిర్వహిస్తారు. ఇక్కడ గనిలో పనిచేసే కార్మికులు ఈ పండుగను గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా చేసుకుంటారు. క్షత్రియుల ఆయుధ విన్యాసాలను పోలిన విన్యాసాలను ప్రదర్శించడం ఇక్కడి సంప్రదాయం. హనుమాన్ అకాడా, దుర్గా అకాడాల లాంటి దేవతల రూపాలతో ఇనుపబెల్టు, త్రిశూలం మొదలైన ఆయుధాలను పట్టుకొని అనేక విన్యాసాలతో ఊరేగింపులు చేస్తారు. కర్రసాము ఈ ప్రదర్శనలో భాగమే. జమ్మిఆకులను ఒకరికొకరు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకుంటారు.





సంగారెడ్డి

సంగారెడ్డిలో దసరా సందర్భంలో తొమ్మిది రోజులు దేవిని ఆరాధించి చివరి రోజున రావణ కుంభకర్ణ బొమ్మలను దగ్ధం చేస్తారు.

ఆంధ్రప్రదేశ్

### విజయవాడ బేతాళ నృత్యం

విజయవాడని ప్రధాన ఆలయాలలో బెజవాడ కనక దుర్గమ్మ ఆలయం ప్రఖ్యాతి చెందింది. ఇక్కడ నవరాత్రి తొమ్మిది రోజులు వైభవంగా ఉత్సవాలు నిర్వహించి, విజయ దశమి నాటికి కృష్ణా నదిలో తెప్పోత్సవం చేస్తారు. తర్వాత విజయవాడ నగర పోలీసులు అమ్మవారిని పాతబస్తీలో ఊరేగిస్తారు. దసరా సందర్భంలో చివరి రోజు ప్రభలు ఊరేగింపుగా వస్తాయి. ఈ ప్రభలలో భేతాళ నృత్య ప్రదర్శన విజయవాడ ప్రత్యేకత.

వీరవాసరం ఏనుగుల సంరంభం

పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో చాలా సంవత్సరాల నుంచి దసరా సమయంలో ఏనుగు సంబరాలు జరపడం ఆచారం. దసరా మొదటి రోజున ఏనుగు గుడిలో భేతాళుడిని నిలబెడతారు. భేతాళుడంటే వయసైన బ్రహ్మచారి. తొమ్మిది రోజులు భేతాళుడు నియమ నిష్ఠలతో అమ్మవారి పూజలు నిర్వహిస్తాడు. వెదురు కర్రలు, గడ్డి, కొబ్బరిపీచుతో చేసిన ఏనుగును రంగు రంగుల కాగితాలతో తయారు చేసిన అంబారీతో అలంకరిస్తారు. అలాగే నూతనంగా చిన్న ఏనుగును తయారు చేసి అలంకరించి చివరి రోజున ఊరేగింపుగా తీసుకు వెళతారు. ఈ ఊరేగింపులో పిల్లలను ఏనుగు కింద నుండి దాటిస్తారు. అలా దాటిస్తే పిల్లలు రోగ విముక్తులై ఆరోగ్యంగా ఉంటారని విశ్వసిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభించి తెల్లవారి ఆరు గంటల వరకు సాగి తూరుపు చెరువు కట్టకు చేరుకొని ఈ ఉత్సవాన్ని ముగిస్తారు.





### విజయనగరం సిరిమాను

విజయనగరంలో దసరా సమయంలో గజపతుల ఆడపడుచైన పైడితల్లికి పూజలు చేస్తారు. ఈ దేవికి దసరా వెళ్లిన తరువాత మొదటి మంగళవారంనాడు జాతర జరుపుతారు. ఈ ఉత్సవంలో భాగంగా పూజారిని సిరిమాను ఎక్కించి అమ్మవారి గుడి ఉన్న మూడు లాంతర్ల సెంటర్ నుండి కోట వరకు మూడు సార్లు ఊరేగిస్తారు.

వీపన గండ్లలో రాళ్ల యుద్ధం

కర్నూలు జిల్లాలోని వీపనగండ్లలో దసరా సమయంలో రాళ్ళ యుద్ధం చేసుకుంటారు. దసరా రోజున సాయం వేళలో ప్రజలు కాలువ ఒడ్డున కాలువకు అటూ ఇటూ చేరి కంకర రాళ్లను గుట్టగా పోసుకుని ఒకవైపు రామసేన ఒకవైపు రావణ సేనగా ఊహించి రాళ్లను విసురుతూ యుద్ధం చేసుకుంటారు. దీనిని వాళ్లు రామ రావణ యుద్ధంగా అభివర్ణిస్తారు.

ఇదే సమయంలో ఇదే జిల్లాలోని దేవరగట్టు గ్రామంలో కూడా బన్ని ఉత్సవం జరుగుతుంది. మాలమల్లేశ్వర స్వామి విగ్రహాన్ని తమ గ్రామానికి తీసుకువెళ్లేందుకు దాదాపు 18 గ్రామాల ప్రజలు, దేవరగట్టు నెలవై ఉన్న రెండు గ్రామాల పరిధిలోని ప్రజలతో కొట్లాడతారు. స్వామిని తీసుకువెళ్లేందుకు ఓ వర్గం, తమ గ్రామంలోనే ఉండేలా చూసుకునేందుకు మరో వర్గం ఎదురుపడి ఇనుప తొడుగులు తొడిగిన వెదురుకర్రలతో విపరీతంగా కొట్టుకుంటారు. ఎంత గాయాలైనా పట్టించుకోరు.

### బందరు శక్తిపటాలు

కృష్ణా జిల్లాలో ఉన్న రేవుపట్టణం బందరులో దసరా సందర్భంగా శక్తి పటాల ఊరేగింపు నిర్వహిస్తారు. దాదాపు నూరు సంవత్సరాల క్రితం కలకత్తా నుండి బొందిలీలకు చెందిన సైనికుడు మచిలీపట్నం ఈడేపల్లిలో కాళీమాత ప్రతిష్ఠ చేశాడు. అప్పటి నుండి దసరా సమయంలో శక్తి ఆలయం నుండి శక్తిపటాన్ని పట్టుకుని పురవీధులలో ఊరేగింపుగా తీసుకు రావడం ప్రారంభం అయింది.





ఊరేగింపు సమయంలో పటాన్ని వీపుకు కట్టుకుని ముఖానికి అమ్మవారి భయంకర ముఖాకృతిని తగిలించుకుని నాట్యమాడుతూ వీధులలో తిరుగుతారు. పటం ధరించినవారు డప్పు శబ్దానికి అనుగుణంగా వీరనృత్యం చేస్తూ భయంకరాకృతిలో ఉన్న రాక్షసుని సంహరిస్తున్నట్లు అభినయిస్తారు.

### ఒంగోలు కళారాలు

దసరా సమయంలో ప్రకాశం జిల్లాలో ఒంగోలులో ఉత్సవాలలో భాగంగా కళారాలకు (పెద్ద ముఖాకృతులు) విశేష పూజలు చేసి ఊరేగిస్తారు. ఇక్కడ కాళికాదేవికి, మహిషాసుర మర్దినికి, నరసింహ స్వామికి కళారాలున్నాయి. కళారాన్ని అటూ ఇటూ ఊపుతూ డప్పుల మోతలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఇలా కళారాన్ని ఊరి నడి మధ్యకు తీసుకువచ్చి అక్కడ రాక్షస సంహారం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

### ఇతర రాష్ట్రాలలో..

తెలుగువారే కాక ఇతర రాష్ట్రాలవారు కూడా దసరా వైభవంగా జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకి మైసూరు, బెంగాల్, గుజరాత్ మొదలైన రాష్ట్రాలు పెట్టింది పేరు. మైసూరులో రాజుల కాలం నుంచి భారీగా జరిగే దసరా ఉత్సవాలు చూడటానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు వస్తారు. కలకత్తాలో దుర్గ పూజ పేరుతో జరిగే ఈ ఉత్సవాలలో తొమ్మిది రోజులు అమ్మవారిని పూజించి, అనేక భగవత్సంబంధిత కార్యక్రమాలు నిర్వహించి, చివరి రోజు కాళికామాతని దర్శిస్తారు. ఆరోజు కాళీమాతని లక్షల మంది దర్శిస్తారట. ఆరోజు నది




తీరంలో కుమారీ పూజలు చెయ్యటం వీరి ప్రత్యేకత. చివరి రోజు దుర్గామాతని హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు.
ఒడిషా పౌరులు కటక్ కళాకారులు రూపొందించిన దుర్గామాత విగ్రహాలను వీధి వీధిలో ప్రతిష్ఠిస్తారు. స్త్రీలు మానికలో వడ్లు నింపి లక్ష్మీదేవిగా భావించి పూజలు నిర్వహిస్తారు. దీనిని వారు 'మానబాన' అంటారు. దశమి రోజు రావణ దహనం కూడా చేస్తారు.
గుజరాత్‌లో దసరా సమయంలో పార్వతీ దేవిని ఆరాధిస్తారు. ఇంటి గోడల మీద శ్రీచక్రాన్ని, త్రిశూలాన్ని, శక్తి ఆయుధాన్ని పసుపుతో చిత్రించి పూజిస్తారు. పొలం నుండి తీసుకువచ్చిన మట్టితో వేదిక తయారు చేసి దానిపై బార్లీ, గోధుమ విత్తనాలను చల్లి, దానిపై మట్టికుండ పెట్టి, దానిని నీటితో నింపి, పోకచెక్క, వెండి/రాగి నాణెం వేస్తారు. ఆ మట్టికుండను వారు దేవిగా భావిస్తారు. దానిని వారు 'కుంభీ ప్రతిష్ఠ' అంటారు. ఈ ఉత్సవాలలో వీరు చేసే గర్బా, దాండియా నృత్యాలు ప్రత్యేకం. ఈ ఉత్సవాలలో స్త్రీలు, పురుషులు వివిధ రంగుల, ఎంబ్రాయడరీ పనితో ఆకర్షణీయంగా వున్న దుస్తులు, నగలు ధరించి, గుండ్రంగా తిరుగుతూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తారు.
ఇలా ఎన్నో ప్రదేశాలలో ఎన్నో రకాలుగా జరుపుకునే ఈ దసరా అమ్మవారి పూజలతో పది రకాల పాపాలు హరింపబడతాయని దశ హరాగా.. అదే కాలక్రమేణా 'దసరా'గా ప్రసిద్ధికెక్కింది. ❒


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com



# ఏ వీధిలో చూసినా పుస్తకాలే

**పుస్తకాలు** చదువుకోవడానికి లైబ్రరీకి వెళతాం. కొనుక్కోవాతంటే బుక్‌షాప్స్‌కి వెళతాం. కానీ ఆ ఊర్లో మాత్రం ఏ వీధిలోకి వెళ్లినా పుస్తకాలే కనిపిస్తాయి. రోడ్డుపైనే బుక్‌షాప్స్ దర్శనమిస్తాయి. ఇళ్లముందే ర్యాక్స్‌లో ఒక క్రమపద్ధతిలో బుక్స్ అమర్చి ఉంటాయి. అందులో మీకు నచ్చిన పుస్తకాన్ని అక్కడే కూర్చుని చదవొచ్చు. వాటిని కొనుగోలు చేయాలంటే మాత్రం డబ్బుని అక్కడే ఉన్న బాక్స్‌లో వేసి తీసుకెళ్లాల్సి ఉంటుంది. మరో విశేషమేమిటంటే పుస్తకాలు అమ్మేందుకు అక్కడ ప్రత్యేకంగా ఎవరూ ఉండరు. 'టౌన్ ఆఫ్ బుక్స్'గా పేరొందిన పోవిస్ అనే చిన్న పట్టణంలో కనిపిస్తుందీ దృశ్యం. అక్కడ ప్రతి వీధిలో పాత పుస్తకాల బుక్‌స్టాల్స్ కనిపిస్తుంటాయి. అందుకే ఈ టౌన్‌కి 'టౌన్ ఆఫ్ బుక్స్' అని పేరు స్థిరపడింది. బ్రిటన్‌లోని వేల్స్, ఇంగ్లండ్ సరిహద్దులో ఉంటుందీ ఊరు.



అక్కడ ఏ ఇంటి ముందు చూసినా బుక్‌షాప్ ఉంటుంది. అన్నీ సెకండ్ హ్యాండ్ పుస్తకాల షాపులే. పుస్తకప్రియులకు కావాల్సిన పుస్తకాలు తక్కువ ధరలో దొరుకుతాయి.




పుస్తకాలన్నీ బయటే ఉన్నప్పటికీ వాటిని అమ్మేందుకు ప్రత్యేకంగా ఎవరూ ఉండరు. ఏదైనా పుస్తకం నచ్చితే తీసుకుని, పక్కనే ఉన్న బాక్స్‌లో డబ్బులు వేయాలి. అందుకే వాటిని 'హానెస్టీ బుక్ షాప్స్' అంటారు. ఏటా యే నెలలో అక్కడ 'హే' లిటరేచర్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తారు. దాదాపు మూడులక్షల మంది రచయితలు, పబ్లిషర్లు, సాహిత్య అభిమానులు ఈ వేడుకకు హాజరవుతారు.

**ఆయన చూపిన బాటలో..**

ఇంతకీ ఆ ఊరిలో పుస్తకాలు అమ్మడం ఎలా మొదలైందీ అంటే 1961లో రిచర్డ్ బూత్ అనే వ్యక్తి మొదటిసారి సెకండ్‌హ్యాండ్ బుక్‌షాప్‌ను ప్రారంభించాడు. బ్రిటన్‌లో మూతపడే స్థాయిలో ఉన్న లైబ్రరీలను ఎంపిక చేసుకుని, అక్కడి నుంచి క్రమం తప్పకుండా పుస్తకాలు కొని తీసుకొచ్చేవాడు. క్రమంగా ఒకరిని చూసి మరొకరు పుస్తకాల షాపులు ప్రారంభించారు. విశేషమేమిటంటేరిచర్డ్ బూత్ ప్రారంభించిన బుక్‌షాప్ ఇప్పటికీ ఉంది. 1970 కల్లా 'టౌన్ ఆఫ్ బుక్స్'గా పేరొందింది. ఏటా ఈ గ్రామాన్ని ఐదులక్షల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారు. కర్రలతో చేసిన చిన్నచిన్న సేల్ఫ్ పుస్తకాలు చక్కగా అమర్చిపెడతారు. పర్యాటకులు ఆ పట్టణంలో ఉన్న అన్ని పుస్తక దుకాణాలు తిరిగి నచ్చినవి కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. పట్టణంలో జనాభా రెండువేల లోపే ఉంటుంది. బుక్‌షాప్స్ 30 వరకు ఉన్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి 'బుక్ టౌన్'గా ఇది గుర్తింపు పొందింది. ❑





# అదో వింత దీవి

**ఇదేదో** హారర్ సినిమా పేరు కాదు. ఇటలీలో ఉన్న ఈ దీవి నిజంగానే దయ్యాల దీవిగా పేరుమోసింది. దాదాపు అర్ధశతాబ్దంగా ఇక్కడ నరమానవులెవరూ నివాసం ఉండటం లేదు. ఈ దీవిలోని నేల కింద 1.60లక్షలకుపైగా శవాలు సమాధి అయి ఉన్నాయి. ఇటలీ ఉత్తర ప్రాంతంలో వెనిస్-లిడో నగరాల మధ్య ఉన్న ఈ దీవి పేరు పోవెగ్లియా. ప్రత్యేక అనుమతి ఉంటేనే తప్ప ఈ దీవిలో సందర్శకులెవరూ అడుగు పెట్టలేదు. ఒకప్పుడు ఈ దీవి మానసిక రోగుల చికిత్స స్థావరంగా ఉండేది. ఇక్కడి మానసిక చికిత్స కేంద్రంలో పనిచేసే ఒక డాక్టర్ రోగులపై క్రూరాతి క్రూరమైన ప్రయోగాలు చేసేవాడు. అప్పట్లో ఇక్కడ





మరణించిన రోగులను ఇక్కడే పాతిపెట్టేవారు. ఇక్కడి మానసిక చికిత్స కేంద్రం 1968లో మూతబడిన తర్వాత ఈ దీవి పూర్తిగా ఖాళీ అయిపోయింది. మూతబడిన కొత్తలో కొందరు సాహసికులు ఈ దీవిలోకి వచ్చి, అంతా కలియదిగిరి వెళ్లిపోయేవారు. కొంతకాలానికి ఈ దీవిలోకి జనాల ప్రవేశాన్ని నిషేధించారు. ఇప్పటికీ ఈ నిషేధం అమలులో ఉంది. పరిశోధనల వంటి కారణాల కోసమైతే ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి పొంది మాత్రమే ఇక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. ఇటీవల బ్రిటిష్ పరిశోధకులు మ్యాట్ నాడిన్, అండీథామ్సన్ ఇటలీ ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి పొంది, ఈ దీవిలోకి అడుగుపెట్టారు. శిథిలావస్థకు చేరుకున్న మానసిక రోగుల ఆస్పత్రి, చుట్టుపక్కల ఉన్న ఇతర శిథిల నిర్మాణాలు, చుట్టూ కీకారణ్యంలా పెరిగిన చెట్లు, మొక్కలు, కట్టడాల మధ్యలో మొలిచిన ఊడల మర్రిచెట్టు వంటివాటిని వీడియో తీసి తమ యూట్యూబ్ ఛానల్‌లో పెట్టడంతో ఈ దీవి కథ వైరల్‌గా మారింది. ఈ దీవిలో 1922లో మానసిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు 1993లో ఒకసారి, 1814లో మరోసారి ప్లేగు మహమ్మారి విజృంభించినప్పుడు ఈ దీవిని క్వారంటైన్ కేంద్రంగా నిర్వహించేవారు. ప్లేగుతో చనిపోయినవారిని, ఆ తర్వాత మానసిక చికిత్స కేంద్రంలో డాక్టర్ ప్రయోగాలకు ప్రాణాలు కోల్పోయినవారిని ఇక్కడి నేలలోనే పూడ్చిపెట్టేశారు. వారి ఆత్మలు ఇక్కడ సంచరిస్తుంటాయని ప్రచారం జరగడంతో ఇక్కడి మానసిక చికిత్స కేంద్రం మూతబడిన తర్వాత ఈదీవి పూర్తిగా నిరుపయోగంగానే మిగిలిపోయింది.

# పవర్‌బ్యాంక్ వాచీలు

ఇవి కొత్తరకం వాచీల్లా కనిపిస్తున్నాయి కదూ! ఇది వాచీలు మాత్రమే కాదు, పవర్‌బ్యాంకులు కూడా. రీచార్జబుల్ బ్యాటరీతో పనిచేసేఈ స్మార్ట్‌వాచీలు అవసరమైనప్పుడు స్మార్ట్‌ఫోన్‌లు, లాప్‌టాప్‌లను చార్జింగ్ చేసుకోవడానికి ఉపయోగపడతాయి. దక్షిణ కొరియాకు చెందిన మార్క్ అండ్ డ్రా కంపెనీ స్మార్ట్‌వాచీలకు అనుబంధంగా ఉండేలా 450 ఎంఏహెచ్ పవర్‌బ్యాంక్‌ను రూపొందించింది. ఈ పవర్‌బ్యాంక్ ఆపిల్ స్మార్ట్‌వాచీలకు బాగా ఉపయోగపడతాయి. ప్రయాణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులకు చర్జింగ్ చేసుకోవడానికి ఇది చాలా అనువుగా ఉంటుంది. ఈ పవర్‌బ్యాంక్‌ను ఒకసారి ఛార్జ్ చేసుకుంటే, సాధారణ పవర్‌బ్యాంకుల కంటే మూడురెట్లు ఎక్కువ సమయం పనిచేస్తుంది. ఈ పవర్‌బ్యాంక్ వాచీ ధర రూ.29,126 మాత్రమే.





## రసోజ్వల



నిత్య జీవితావసరాల్లో
పద్యం దేనికీ అక్కెర రాకపోవచ్చు
కానిదానికుండే ఆకర్షణ
అనితర సాధ్యం.
పద్యానికి
కిరాణా షాపువాడు
చక్కెర కూడా ఇవ్వకపోవచ్చు
కాని దాని తీపి
హృదయమైన వేద్యం.
వర్షం కురిపించడానికి
పద్యం మేఘం కాకపోవచ్చు
కాని
అది ఆకాశమంత ఆశను మెరిపిస్తుంది.
పద్యం/ సేద్యం చెయ్యకపోవచ్చు
కాని
ఒక స్వామినాథన్ ఆవిర్భావానికి
బీజం వేస్తుంది.
కవిత్వం గాలి లాంటిది
దాని నిండా ప్రాణవాయువే
దానిలో/ ప్రేమా కరుణా ఉత్సాహాలు
పుష్కలంగా లభిస్తాయి./ మిత్రులారా!/ కవిత్వాన్ని
ఒక్కసారి
గుండెలకు హత్తుకోండి
ఇప్పుడు చూడండి!

**- డా॥ ఎన్.గోపి**

## నానీలు

కలం/ కత్తెరగా మలిస్తేనే
జబ్బు పడ్డ వ్యవస్థకు/ శస్త్రచికిత్స.
రాతికి/ జీవం ఉంటుంది
మనసు పెట్టి
శిల్పంగా మలిచి చూడు.
ఉదయానికి/ స్పృహ ఎక్కువ
ఎన్ని హృదయాలని/
మేల్కొలుపుతుంది!
పుస్తక పుటలలో/ అక్షర కాంతి
ఎన్ని జీవితాలకి/ వెలుగిస్తుందో!
ఎప్పుడు/ ఒంటరినని అనుకోకు
నీ అంతర్ముఖం/ నీతోనే.
జీవితంలో
ఎన్ని మెట్లెక్కినా
కింది మెట్టును
మరచిపోకు.

**- కయ్యూరు బాలసుబ్రమణ్యం**

## పుస్తక పఠనమే మిన్న



నేటి నెట్టింట చిక్కుకున్న
మనిషి గూగుల్ మోజులో
పుస్తక పఠనానికి దూరమై
నానో డిజిలీటీకరణకు
దగ్గరయ్యాడు.
లుక్కు కల్చర్ వద్దు
బుక్కు కల్చర్ ముద్దు
గూగులమ్మ కన్న
పుస్తక పఠనమే మిన్న
విజ్ఞానాన్ని తర తరాలకు
అందించే పుస్తకాన్ని నమ్ము
విజ్ఞానవంతుడివి కమ్ము
విజ్ఞాన నిలయాలైన పుస్తకాలు
సమాజ ప్రగతికి రథ చక్రాలు
విశ్వ మానవాళిని
విజ్ఞాన ప్రపంచంలో

### ఈవారం కవిత్వం

విహరింపచేసే పుస్తకమే
విజ్ఞానం వికసించిన మూడో కన్ను
వివేకం మనిషికున్న దన్ను
పఠనంతో ప్రజ్ఞ సృజన వివేకం
విశ్లేషణ పరిశీలన పరిశోధన
వివరణ ప్రతిపాదన సామర్థ్యాలు
వికసిస్తాయి
పఠనంతో ప్రతిభా వికాసం
పఠనంతో మేథోవికాసం
విజ్ఞానం తరగని కరగని గని
మనిషిని మనిషిగా నిలబెట్టేది
పుస్తకమే.
పుస్తక పఠనం మహా యజ్ఞమైతే
అజ్ఞానమనే చీకటిని పారదోలేను
విజ్ఞాన వికాస వెలుగులు
విరజిమ్మేను.

**- నేదునూరి కనకయ్య**

# పుస్తక సమీక్ష

## ఆలోచింపచేసే కథలు



'34 గోఖలే రోడ్ నార్త్' పుస్తకంలో డా॥తాటి నరహరి రచించిన 10 కథలు, 9 కవితలు ఉన్నాయి. అధికంగా వైద్యజీవితాలకి సంబంధించిన కథలున్నా ఈ సంపుటిలోని కథలలో రచయిత బొంబాయిని దృశ్య మాన్యం చేశారు. చైతన్యభరితమైన కథలు ఇవి. విధిరాతను తప్పించుకోవటం వీలు పడదని తెలుపుతుంది 'విధి' అనే కథ. పడిలేవటంలోని గొప్పతనాన్ని ప్రవచిస్తుంది 'అగ్లాస్టేషన్ ప్రభాదేవి కథ'. ఆశాభావాల్ని ప్రదర్శిస్తుంది కథ. ప్రేమ, డబ్బుల నడుమ సంబంధాన్ని సున్నితంగా ప్రదర్శిస్తుంది 'మాంగల్యం తంతునానేనా'. కథ, కథలన్నీ వేగంగా చదివిస్తాయి. ఆలోచింపచేస్తాయి. కవితలు సైతం సమాజంపట్ల, సమస్యల పట్ల చక్కని అవగాహనను ప్రదర్శిస్తాయి. పదాలు పొందికగా ఉండి కథల పఠనాన్ని ఆనందకరమైన అనుభవంగా మలుస్తాయి. 'వివిధ జాతులనిలయం/ విభిన్న సంస్కృతుల వలయం/ చిన్నచిన్న మనస్పర్థలెన్నున్నా/ ఐక్యతే మా ఆయుధం/ అందుకే..మేరా భారత్ మహాన్' అంటాడు కవి. 'నాణానికి మరోవైపు కవితలో 'డిఎన్ఎ' కవిత చమత్కారభరితంగా ఉంటుంది.

'ఆకాంక్ష' కవితలో కవి ఉన్నతమైన భావాలను ఉత్తమంగా ప్రదర్శించారు. చక్కని కథలు, కవితలు చదవాలనుకున్న వారికి సంతృప్తినిస్తుంది పుస్తకం.

**(34 గోఖలే రోడ్‌నార్త్, రచన: డా॥ తాటి నరహరి, వెల: రూ 150, ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక విక్రయ కేంద్రాలు)**

– నిర్మోహి

## వింజమూరి వారి వింజామర




వింజమూరి వరద రాజఅయ్యంగార్, ఆకాశవాణి శాస్త్రీయ సంగీత ప్రక్రియావిష్కర్తగా సంగీత, సాహితీ సరస్వతిని ఆరాధించి చిరఃప్రతిష్ఠ సాధించిన జ్ఞానతపస్సంపన్నులు. కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వన్మణిగా యావత్ప్రపంచంలో గానకళకాంతి ప్రసవింపచేసి, ఆధునిక సమాజానికి భగవద్భక్తి చివురింప చేసిన కళాతపస్వి. వింజమూరి వారి మహోన్నత జీవన సాఫల్యత, కర్ణాటక సంగీత వాగ్గేవతా, కటాక్ష పరిపూర్ణత సాధించిన సంగీత ప్రస్థానాన్ని సంధ్య వింజమూరి, మహోద్గ్రంధంగా వెలువరించడం కర్ణాటక సంగీత విద్యావాణీ పాదపద్మాలకు సమర్పించిన అపూర్వ పూజాపుష్పం. ఆసేతు హిమాచలం కచ్చేరీలు, అపూర్వరాగాలు కృతులు వెలుగు చేయడం, సంగీత సభలు స్థాపించి నిర్వహించడం, సంగీత ప్రపంచానికి నభూతో నభవిష్యతిగా 1939-1966 సంవత్సరాలలో ఆకాశవాణి ద్వారా ప్రప్రథము లుగా శాస్త్రీయ సంగీత ప్రచారవాణికి శ్రీకారం చుట్టిన ఆవిష్కర్త వింజమూరి వారు. కర్ణాటక సంగీత మార్గదర్శిగా వారి అమూల్య చరిత్రను ఈ గ్రంథంలో సంధ్య ఎంతో వ్యవప్రయాస లతో సంపుటీకరించారు. ప్రస్తుత భవిష్యత్ యువ, విద్యార్థి శాస్త్రీయ సంగీత ప్రపంచం సర్వత్రా ఆరాధించుకోవలసిన మహోద్గ్రంథం.

**(కర్ణాటక సంగీత మార్గదర్శి వింజమూరి వరదరాజ అయ్యంగార్, వెల: రూ 995, ప్రతులకు: సంధ్యా ఎల్.వింజమూరి, 17 నాగరత్నం నగర్ ఎక్స్‌టెన్షన్, తిరునీర్మలైరోడ్, వెస్ట్ తాంబరం, చెన్నై-600045)**

– జయసూర్య

## 'అక్షరవర్షంతో రాళ్లూ చిగురిస్తాయి'

ఈ పుస్తకాన్ని కవి పొత్తూరి సుబ్బారావు తన చిరకాల మిత్రుడు గందూరి శివరామమూర్తికి అంకితం చేసారు. సినీగేయ రచయిత భువనచంద్ర డా॥వంశీరామరాజు, తెన్నేటి సుధాదేవిలు చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. దాదాపు 71 కవితలతో ఈ పుస్తకం కవిత్వాభిమానుల్ని అలరిస్తుంది. వివిధ పత్రికల్లో ప్రచురణై పాఠక ఆదరణను పొందిన కవితల సమాహారం ఈ సంపుటి. బీటలు వారిన శిలల నడుమ/ వాటికి




మట్టి వాసనేదో తగిలినట్లుంది, చొరబడిన విత్తనాలతో/ రాళ్లూ చిగురిస్తాయి/ (పేజి.80) అంటారు శీర్షికగా పెట్టిన కవిత 'రాళ్లూ చిగురిస్తాయి'లో. రైతుకష్టంఫలం, రైతులకు దక్కనీయకుండా కార్పొరేట్ పరం చేసే కుయుక్తులను తుంచేసేశక్తి వాళ్లనరనరాల్లో పదిలంగానే వుంది. పంటకంటిన చీడను వదిలించినట్లే సర్కారంటించిన కొత్త చట్టాలపీడను విరగతీయగలరు' (పేజి.84) అంటారు రెక్కలు తెగిన జీవితం కవితలో. ప్రపంచపు నీలాకాశంలో అక్కడక్కడా మెరిసిన ఎర్రని చుక్కలు/ తెలంగాణ గడ్డపై రావి తిరుగుబాటు విత్తనాలై మొలకెత్తాయి. మగ్దూం, రావి, ఆరుట్ల, షోయబుల్లాఖాన్‌లో సాహసనౌకను మల్లుస్వరాజ్యం, సంగం లక్ష్మీబాయిల వంటి ధీరవనితలెందరో 'విముక్తి' దశగా పయనింపచేశారు. (పేజి.144) అనే కవితలో. నిబద్ధత, శ్రామికజన పక్షపాతం, మానవీయకోణంలో సమాజ పరిశీలన స్పష్టంగా కనిపిస్తాయి. వీరి లేఖిని నుండి మరిన్ని చైతన్యపూరిత కవిత్వం ఆహానిస్తూ అభినందిస్తూ.

**(రాళ్లూ చిగురిస్తాయి, రచన: పొత్తూరి సుబ్బారావు, వెల: 150, ప్రతులకు: అన్ని ప్రముఖపుస్తకశాలలు)**

– తంగిరాల చక్రవర్తి

## భాగవత మందార మకరందము

రామాయణ భారత భాగవత కావ్యాలలో ప్రతిపద్యము, ప్రతి పదమూ, హృద్యమే! అవి రత్నాకరాలు. తరచిన కొలది రుచులూరు రసరమ్య సుధాభాండాలు. నేటికాలానికి ఇవి, తమ ప్రాముఖ్యతను కోల్పోతున్నాయి. శాంతాభాస్కర్



వీటిని తిరిగి ప్రాచుర్యములోనికి తీసుకురావాలన్న సత్సంకల్పంతో పూనుకున్నారు. పోతనామాత్యుడు తెనిగించిన భాగవతములోని, ప్రఖ్యాతమైన, జనరంజకములైన 108 పద్యాలను ఏరుకుని వాటిని పేర్కొంటూ, అవి ఏయే సందర్భాన భాగవతంలో ఇవ్వబడినవో వివరిస్తూ ఆ పద్యాల భావము, ప్రతిపద అర్థాలను ఈ చిన్న పుస్తకం ద్వారా మనకందిస్తున్నారు. తెలుగు బాలబాలికలను తమ దృష్టియందుంచుకుని రాసినవి కావడం వల్ల, భావము, అర్థము అతిసరళమైన వాక్యములలో ఏర్చికూర్చినారు. సాహిత్య ప్రక్రియలన్నింటిలోను నాలుగు కాలాల పాటు నాలుకలపై నిలిచి ఉండేవి పద్యాలు. ఆయాసందర్భాలలో ఉటంకించుట వలన మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిం చిన వారలము అవుతాము. అందరూ చదివి మననం చేసుకో వాలి అన్న సదాశయంతో చక్కని ముఖచిత్రం, బాలురు, వయో వృద్ధులకు సౌకర్యంగా ఉండే అక్షరాలు, ప్రింటు చేసి అందిస్తున్న టి.శాంతాభాస్కర్ అభినందనలు. **(శ్రీమదాంధ్ర మహాభాగవతము, కొన్ని ప్రసిద్ధపద్యాలు, రచన: టి.శాంతాభాస్కర్, వెల: రూ 100, ప్రతులకు: లోకేష్ ప్రచురణలు, చిత్తూరు)**

**– కూర చిదంబరం**



# పురుగుమందు వృథాకాదు

**భు**జానికి యంత్రాలను తగిలించుకుని రైతులు పంటపొలాలకు పురుగుమందులు పిచికారీ చేయడం చూస్తూనే ఉంటాం. బరువైన ట్యాంకు ఒకవైపూ..ఆ రసాయనాల ప్రభావం మరోవైపు వారిని ఇబ్బంది పెడుతుంటాయి. ఆ పని చేయడానికి కూలీల కొరత కూడా వేధిస్తుంటుంది. పిచికారీ పనిని కాస్త సులభం చేసేందుకు పలు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రకరకాల డ్రోన్లనూ తయారుచేశారు. కానీ వాటివల్ల పంటకు రసాయనాలు ఎంత మేరకు అందుతాయో తెలియదుగానీ, వృథాగా నేలమీద పడేదే ఎక్కువ ఉంటుంది. ఖరీదైన క్రిసంహారకాలు అలా మట్టిపాలు కావడం రైతులకు ఆర్థిక భారమయే కదా. పైగా అవి భూసారాన్ని హరించేసి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అన్నదాతకు ఆ నష్టాన్ని తగ్గించాలని కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఒక యంత్రాన్ని తయారు చేశాడు జైసింహా.

కర్ణాటకలోని చిక్కమగళూరు ప్రాంతంలో పుట్టి..కువైట్, మిడిల్‌ఈస్ట్‌లో పెరిగిన జైసింహ అమెరికాలో ఇంజినీరింగు పూర్తి చేశాడు. తరువాత ఓ సంస్థలో ఏడేళ్లపాటు పనిచేశాక 2014లో రాజీనామా చేసి బెంగళూరు వచ్చి స్థిరపడ్డాడు. జైసింహా తండ్రికి చిక్కమగళూరు ప్రాంతంలో కాఫీ తోటలున్నాయి. ఒకసారి ఆ తోటల్ని చూడ్డానికి వెళ్లిన అతను రసాయనాల్ని పిచికారీ చేస్తున్న తోటమాలిని చూశాడు. ఆ సమయంలో పెస్టిసైడ్, మొక్కలపై కొంతనేలపైన పడటం గమనించాడు. 'అయ్యో అలా పురుగుమందు కింద పడటం వల్ల పొలానికి నష్టం కదా' అంటే యాభైఏళ్ల నుంచీ తాను ఇలానే చేస్తున్నాని తోటమాలి సమాధానం చెప్పాడు. దాంతో మొక్కజొన్న, మిరప, కంది, పత్తి, పసుపు, వేరుసెనగ తదితర పంటలకు క్రిమిసంహారకాలు ఎలా చల్లుతున్నారో గమనించడానికి పొలం బాటపట్టాడు జైసింహా. రైతులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న యంత్రాలను వినియోగించినా అక్కడా అదేతీరు.

**యంత్రాలతో పని వేగంగా..:** యంత్రాలతో పని వేగంగా జరుగుతున్నా..రసాయనాల వృథా మాత్రం తప్పట్లేదు. అందుకే ఆధునిక వ్యవసాయ పనిముట్లు తయారు చేయడానికి 2015లో 'నిఖో రోబోటిక్స్' పేరుతో ఓ స్టార్టప్‌ను ప్రారంభించి ఏఐతో నడిచే రోబోటిక్ పిచికారీ యంత్రాన్ని డిజైన్ చేయడం మొదలు పెట్టాడు. దాదాపు ఎనిమిదేళ్లు కష్టపడి ఈ మధ్యే ఆ ఆవిష్కరణ పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చాడు.

**చీకట్లోనూ పని చేసుకోవచ్చు..**

జైసింహా రూపొందించిన యంత్రం ఒకేసారి ఎనిమిది సాళ్లకు పురుగుమందును పిచికారీ చేస్తుంది. దానికి అమర్చిన కెమెరా ఏఐ సాయంతో పొలంలోకి దిగగానే మొదటసాళ్లలో మొక్క ఆకుల్నీ, కాండాన్నీ స్కాన్ చేస్తుంది. ఆ సమాచారాన్ని రసాయనాలు బయటకు వచ్చే ద్వారానికి చేరవేస్తుంది. దాంతో కెమెరా బంధించిన ప్రాంతంలో రంధ్రాలు తెరచుకుని, నేల కనిపించే భాగంలో మూసుకునిపోతాయి. అందుకే కేవలం మొక్కలపైన మాత్రమే పురుగుమందు పడుతుంది. నేలపాలు కాకుండా ఓ క్రమపద్ధతిలో జరిగే ఈ పనివల్ల పురుగుమందు వృథా, రైతుకు ఆర్థికభారమూ తగ్గుతాయి.



అంతేకాదు, రాత్రిపూట కూడా చక్కగా పనిచేసే ఈ రోబోటిక్ స్ప్రేయర్‌కు ఉన్న కెమెరాల్లో నైట్‌మోడ్ ఆటోమేటిగ్గా ఆన్ అయి చీకట్లోనే మొక్కను స్కాన్ చేస్తాయి. ఈ యంత్రంతో స్కాన్ చేసి కీటకనాశిని చల్లడానికి ఎక్కువ సమయం పడుతుందనే సందేహం కూడా అక్కర్లేదు. పని చాలావేగంగా అయిపోతుంది. పత్తిరైతుల ఆత్మహత్యలు జరిగే యవత్మల్, ఆకోలా జిల్లాలో దాదాపు ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా దీన్ని పరీక్షించి చూశాడు జైసింహా. ఆ సమయంలో రైతులు వాడే రసాయనాల్లో దాదాపు 60శాతం ఆదా అవడం పగలూ, రాత్రీ పని జరగడం తక్కువ సమయంలో పని పూర్తవడం వంటివెన్నో గమనించిన రైతులు ఈ రోబోటిక్ యంత్రాన్ని వినియోగించడానికి ముందుకొచ్చారు. ఇటీవలే యంత్రాలను మార్కెట్ లోకి తీసుకొచ్చిన జైసింహా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లోని వేలమందిరైతులు వాటిని చేరువ చేశాడు. రోజుకు రూ 350కే అద్దెకు ఇస్తున్నాడు. ఆలోచన, టెక్నాలజీ మీద పట్టు ఉంటే జనానికి మేలు చేసే ఎలాంటి ఆవిష్కరణలైనా చేయొచ్చని జైసింహా నిరూపించారు. ❑

# డబుల్‌సైడ్ మల్టీ మేకర్



శ్రమలేకుండా సౌకర్యాలను అందించడంతోపాటు కిచెన్‌కి లగ్జరీ లుక్ ఇచ్చే ఈ డబుల్‌సైడ్ హీటింగ్ బేకింగ్ మెషిన్..యూజర్ ఫ్రెండ్లీగా డిమాండ్‌లో ఉంది. ఇందులో ఇండిపెండెంట్ టెంపరేచర్ కంట్రోల్, డబుల్‌పాన్ గ్రిల్లింగ్, త్రీ టైప్స్ ఆఫ్ బేకింగ్ వంటి ఆప్షన్స్ ఉన్నాయి. మూడు లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ఎలక్ట్రిక్ మేకర్.. రకరకాల రుచులను నిమిషాల్లో సిద్ధం చేస్తుంది. ఈ మేకర్‌లో గ్రిల్ లేదా ఫ్రై చేసుకోవాలంటే నూనె చాలా తక్కువ మోతాదులో సరిపోతుంది. క్లీన్ చేసుకోవడమూ సులభమే. ఇది రోజువారీ వంటకాలకే కాకుండా పార్టీలు, ఫంక్షన్స్‌లో వెరైటీ వంటకాలు చేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందులో కూరలు, సూప్స్ వంటివి సిద్ధం చేసుకోవడంతోపాటు పాన్‌కేక్స్, కట్లెట్స్ వంటివెన్నో తయారు చేసుకోవచ్చు. దీనితో షార్ట్ సర్క్యూట్ సమస్య రాదు. దీనికి అటాచర్డ్‌మూతతో పాటు ఒక ట్రాన్స్‌పరెంట్ మూత విడిగా లభిస్తుంది.




# ఆటోమేటిక్ ప్రెజర్ కుకర్

ఈ ఆటోమేటిక్ ప్రెజర్ కుకర్ ఆహారంలో పోషకాలు పోకుండా హెల్దీఫుడ్‌ని అందిస్తుంది. ఇందులో చాలా ప్రీసెట్ ఆప్షన్స్ ఉంటాయి. కర్రీ, సూప్, దాల్, గ్రేవీ, బిర్యానీ, పులావ్..ఇలా గాడ్జెట్ ముందువైపు ప్రత్యేకమైన సెట్టింగ్స్ ఉంటాయి. మల్టీపర్పస్ కోసం తయారైన ఈ గాడ్జెట్ చూడటానికి అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది. పైనున్న ప్రెజర్‌మూతతోపాటు..అదనంగా లభించే ట్రాన్స్‌పరెంట్ మూత..చాలా రకాల వంటకాలకు అనువుగా ఉంటుంది. ప్రత్యేకమైన గ్లాస్, గరిటె, సేఫ్టీగాడ్స్ వంటివి డివైస్‌తో పాటు లభిస్తాయి. అవసరాన్ని బట్టి 3స్థాయిల్లో టెంపరేచర్ పెంచుకోవచ్చు. లేదా తగ్గించుకోవచ్చు. దీనిలోని మన్నికైన నాన్-స్టిక్ 3లీటర్స్ పాట్ నలుగురికి లేదా ఐదుగురికి సరిపోతుంది. యాంటీ-స్కిడ్ బేస్‌తో పెద్ద ఇన్సులేట్ హ్యాండిల్ భద్రతను కలిగిస్తుంది. దీన్ని వంటరాని వారు కూడా వినియోగించడం చాలా సులభం.

# ట్రెండీ బర్నర్

ఉదయం నుంచి రాత్రి వరకు కావాల్సిన రుచులను తయారు చేసుకోవడంలో ఈ న్యూ టెక్నాలజీ బర్నర్ భలే చక్కగా పనిచేస్తుంది. ఇది సౌకర్యవంతమైనదే కాదు..సురక్షితమైనది కూడా. సాధారణ హాట్‌ప్లేట్ బర్నర్‌తో పోలిస్తే ఇది ఫార్-ఇన్‌ఫ్రారెడ్ ఎనర్జీ అసెంబ్లింగ్ టెక్నాలజీతో తరచుగా ఉపయోగించడానికి, ఉష్ణోగ్రతను తట్టుకునేందుకు వీలుగా రూపొందింది. ఐరన్‌పాన్, స్టెయిన్‌లెస్ స్టీల్, సిరామిక్, అల్యూ మినియం..ఇలా అన్నిరకాల పాత్రలనూ దీనిపై పెట్టి, కావల్సిన వెరైటీలను సిద్ధం చేసుకోవచ్చు. ఈ బర్నర్ చాలా తేలిగ్గా ఉండటంతో క్యాంపింగ్‌లకు తీసుకుని వెళ్లడం, చిన్నగా ఉండటంతో వంటగదిలో స్టోర్ చేయడమూ చాలా ఈజీ. అలాగే కుకింగ్ బౌల్స్ ఉంచే క్రిస్టల్‌గ్లాస్ ప్లేట్‌ను తడివస్త్రంతో క్లీన్ చేయొచ్చు. వేరియబుల్ హీట్ సెట్టింగ్స్ కల్గిన ఈ గాడ్జెట్‌పైన ఫ్రై, డీప్ ఫ్రై బాయిలింగ్, కుకింగ్ ఇలా చాలానే చేసుకోవచ్చు.



కథ

# మానవత్వం

గోపవరంలో గోపయ్యకు పది గోవులు వున్నాయి. ఆ గోవులన్నిటిని తన రెండు ఎకరాల పొలంలో పోషించేవాడు. వాటిని చూసుకునే బాధ్యతను ఒక పిల్లవాడికి అప్పగించాడు. ఆ పిల్లవాడు గోవులను కన్నబిడ్డలవలే చూసుకునేవాడు. అప్పటి నుంచి పశువులు పాలు బాగా ఇచ్చేవి. పేదవాడైన గోపయ్యకు పాడిపంటలతో సంపద పెరిగింది. ఇది పక్క పొలంలో వున్న రాజయ్య గమనించసాగాడు. రాజయ్య బాగా ధనవంతుడు. ఆ ఊర్లో బాగా పేరొందిన మోతురి. తనే గొప్పగా బతకాలని భావించేవాడు. తన గురించి తప్ప ఇతరుల గురించి పొగిడితే ఓర్వలేడు. పగబట్టి పతనం చేసేవాడు. తన కళ్ల ఎదుటే గోపయ్య ధనవంతుడు కావటం, అతని పశువులు తన గోవులకన్నా అధికంగా పాలు ఇవ్వడం జీర్ణించుకోలేకపోయాడు. పతనం చేయాలని పన్నాగం పన్నాడు.



మరుసటి రోజు గోపయ్య గోవులు పిల్లవాడి అశ్రద్ధతో రాజయ్య పొలంలో పడ్డాయి. ఏపుగా పెరిగిన వరిపైరును మేశాయి. ఇది చూసిన రాజయ్య పగపట్టాడు. పెద్ద కర్ర తీసుకుని ఆవుకాళ్లపై బాదాడు. అది భయంతో దిక్కులు తిరుగుతూ తప్పించు కోవడానికి ప్రయత్నించినా పరిగెత్తించి బాదాడు. గోవుకాళ్లపై బాదడంతో కుప్పకూలింది. కాలు విరిగింది. పైకి లేవలేక కన్నీరు కార్చింది. రాజయ్యకు పగ తీరలేదు. 'నా పైరులో పడతావా?' అని హుంకరిస్తూ కడుపు మీద రెండు దెబ్బలు బాది వెళ్లిపోయాడు.

కాసేపటి తర్వాత గోపయ్యకు తన గోవు కనిపించకపోవడంతో చుట్టూ వెతికాడు. అది రాజయ్య పొలంలో కన్నీరు కార్చుతూ కనిపించడంతో ఆందోళనతో వెళ్లి అవాక్కయ్యాడు. కాళ్లు విరిగిపోవడంతో పైకి లేకలేకపోయింది. గోపయ్య ఇక చేసేదేమీ లేక వైద్యం అందించాడు. విరిగిన కాలుతోనే కుంటుతూ వచ్చి తన పశువుల పాకలో కూలబడింది. ఇదంతా రాజయ్య గోవులు గమనించసాగాయి. కట్లు తెంచుకుని వచ్చి గోపయ్య గోవువద్ద నిలబడ్డాయి. కళ్లనిండా సుడులు తిరుగుతున్న కన్నీటితో పరామర్శించాయి.

ఆరోజు నుంచి రాజయ్య ఆవులు పాలు ఇవ్వడం మానివేశాయి. దాన్ని చూసి మిగిలిన పశువులు కూడా కళ్ల ముందు కనిపించిన దృశ్యాన్ని నెమరువేసుకుంటూ బాధతో పాలు ఇవ్వడం మానివేశాయి.

ఒక్కసారిగా పాలు ఇవ్వడం మానుకోవడంతో రాజయ్య 'పాల వ్యాపారం ఆగిపోయింది. దీనికి కారణం ఏమిటీ? గోపయ్య పాల వ్యాపారాన్ని దెబ్బతీయాలనుకుంటే నా పాల వ్యాపారానికి ఎదురుదెబ్బ తగిలింది ఏమిటా!' అని ఆలోచించసాగాడు రాజయ్య. సరిగ్గా అప్పుడే రాజయ్య పశువు ఒకటి గోపయ్య ఆవు దగ్గరకు వెళ్లడం చూసి దాని వెనుకే వెళ్లాడు. తన గోవు గోపయ్య పశువు వద్ద నొల్చొని కన్నీరు పెట్టుకోవడం తన మనసును తీవ్రంగా కలచివేసింది. ఆన ఆగ్రహానికి గోపయ్య పశువు కాలు విరిగి పైకి లేవలేకపోవడం చూసి నిర్ఘాంతపోయాడు. మానవ త్వం మరిచి నోరులేని జీవాలను హింసించినం దుకు తన పాల వ్యాపారం దెబ్బతిని తగిన శాస్తి జరిగింది. గోపయ్య గోవుకు ఎదురైన బాధను చూసి నోరులేని తన గోవు ఓదార్చడం చూసి రాజయ్య మనసు చలించింది. మానవత్వం మరిచి క్రూరంగా హింసిం చినందుకు అది అనుభవిస్తున్న నరకాన్ని చూశాడు. ఆ పరిస్థితి తనకు ఎదురైతే ఊహించి భయాందోళనకు గురయ్యాడు. పశ్చాత్తాపంతో గోపయ్య వద్దకు వెళ్లి తను చేసిన పనికి క్షమించమని కోరాడు. వివేకంతో మానవత్వం విలువను తెలుసుకున్నాడు రాజయ్య.

– **బోగా పురుషోత్తం**, తుంబూరు





## బాలగేయం

### గురువులకు వందనం

చదువులు చెప్పే
గురువులందరికీ వందనం
సకల జ్ఞానాన్ని
జీవనదిలా పారించే
గురువులందరికీ వందనం
పాదాభివందనం
నేటి బాలలే రేపటి
పౌరులుగా తీర్చిదిద్దే
గురువులందరికీ వందనం
పాదాభివందనం
అల్పెరుగక అనునిత్యం
విజ్ఞానపు జ్యోతులనిచ్చే
గురువులందరికీ వందనం
పాదాభివందనం
మంచిచెడులను తెలియజెప్పి
భవిష్యత్తుకు బాటలు వేసే
గురువులందరికీ వందనం
పాదాభివందనం
తనువును పునాదులుగా నిల్పి
విశ్వమేధావులను అందించే
గురువులందరికీ వందనం
పాదాభివందనం
విద్యామృతపు
ఊటలనందించి
రంగులలోగిలై విలసిల్లే
గురువులందరికీ వందనం
పాదాభివందనం

**- సింగిడి శ్రీనివాస్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.అన్విత,** కొత్తకోట

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మామూలు సినిమాకు, 3డీ సినిమాకు మధ్యగల ముఖ్యమైన తేడా ఏమిటి?**

**జవాబు: అన్విత!** మామూలు సినిమాలు చూస్తున్నప్పుడు మనం పొడవు, వెడల్పు కొలతలు.. రెండింటిని మాత్రమే గ్రహిస్తాం. 3డీ సినిమాలకు మూడు కొలతలు అవసరం. పొడవు, వెడల్పు, లోతు ఉండే విధంగా ప్రత్యేక టెక్నాలజీని ఉపయోగించి 3డీ సినిమాలను రూపొందిస్తారు. 3డీ సినిమాలను గురించి వినే వుంటారు. తెలుగులో కూడా డబ్ అయ్యాయి. ఈ సినీ ప్రేక్షకులకు ప్రత్యేకమైన కళ్లజోళ్లను కూడా రూపొందించారు. వీటి ద్వారా ఈ సినిమాలను చూస్తే తెర మీద ఉన్న బొమ్మలు మనకు అతి సమీపంగా ఉన్నట్లు భ్రమ చెందేలా కనిపిస్తాయి. 1984లో తొలి త్రీడీ సినిమా 'చిన్నారి చేతన' (ఛోటా చేతన్) విడుదలైంది.

**- ఎస్.మంజుశ్రీ,** బొబ్బిలి

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనలో రక్తం ఎంత ఉండాలి?**

**జవాబు: మంజుశ్రీ!** మనలో రక్తం ఎంత వుండాలనేది బరువును, ఎత్తును అనుసరించి ఉంటుంది. సాధారణంగా డెబ్బై కిలోల బరువు వున్నవారిలో అయిదు న్నర లీటర్ల రక్తం ఉంటుంది. రక్త పరీక్షల్లో హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందనేది ప్రధానంగా చూస్తారు. ఒక క్యూబిక్ మిల్లీమీటర్ రక్తంలో నాలుగు నుంచి ఆరు మిలియన్ ఎర్ర రక్తకణాలు ఉంటాయి. పురుషులలో హిమోగ్లోబిన్ 13 నుంచి 15; స్త్రీలలో 11.5 నుంచి 13 మిల్లీ గ్రాములు ఉండాలి. వీటికంటే తక్కువ ఉంటే 'రక్తలేమి' (ఎనీమియా) ఉందని నిర్ధారిస్తారు. రక్తం తక్కువగా ఉందని ఐరన్ టాబ్లెట్లు వాడటం శ్రేయస్కరం కాదు. సమతుల ఆహారం తీసుకుంటే అవసరమైన ఐరన్ చేకూరుతుంది. కొన్ని రకాల ఆహారాలు(ఫాస్ట్‌ఫుడ్స్, ఐస్‌క్రీములు, కాఫీ, టీలు మొదలై నవి) ఐరన్‌ను అందించకపోగా నష్టం కలుగచేస్తాయి.







# సంబురాల 'సద్దుల బతుకమ్మ'

డా॥ ఓరుగంటి సరస్వతి

ప్రపంచంలోనే ఎక్కడా లేని, కనీ వినీ ఎరుగని విధంగా ప్రకృతి పూల బతుకమ్మ పండుగను తెలంగాణలోనే జరుపుకోవడం విశేషం. తరతరాలుగా పెద్దలిచ్చిన ఆనవాయితీల్ని దాచిపెట్టుకొని, ముందు తరాల (మరోవంశం ) వారికి అందించడమే ఆనవాయితీ అనుకుంటాం కానీ అది తప్పేమో అనిపిస్తుంది. ఎందుకంటే సంపద కంటే సంస్కృతి గొప్పది. సంస్కృతిలోనే జీవన విలువలు దాగున్నాయి. అటువంటి విలువల్ని ప్రకృతితో మమేకమై జరుపుకునే ప్రతీ పండుగలోనూ ఉంటుంది. ఇటువంటి సంస్కృతి, సంప్రదాయాలకు పల్లెలు ఆలవాలమని చెప్పొచ్చు. ప్రతీ పండుగ ఆచారాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తూ, ప్రకృతి అనే శక్తికి భక్తి అనే ఆచారంతో ప్రజలందరినీ రక్షించమనే వేడుకోలు విన్పిస్తుంది. పిల్లలు, పెద్దలు, కలిసి మెలసి, ఆడుతూ, పాడుకునే ప్రకృతి పూలపండుగ 'బతుకమ్మ'. మహాలయ అమావాస్య మొదలు తొమ్మిది రోజులు భక్తితో గౌరవమ్మకు మహిళలు చేసే పండుగ. ఆశ్వయుజ మాసంలో ప్రకృతంతా పచ్చదనంతో పుడమిపై నిండు ముత్తైదువులా కొలువై ఉంటుంది. రంగు రంగుల పువ్వులతో భూమి ఇంద్రధనస్సు చీరను చుట్టుకొన్నట్లు ఉండడం విశేషం. తెలంగాణలో పల్లెపల్లెనా చిన్నా పెద్దా తేడా లేకుండా బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆది నుండి వస్తున్నది.

ముఖ్యంగా మహిళలు, ఆడపిల్లలు ఎంత దూర ప్రాంతంలో ఉన్నా ఈ పండుగకి తమ పుట్టింటికి వస్తారు. మెట్టినింట్ల ఎన్ని బాధలున్నా, కొంత విడుపుగా తల్లిగారింటికి వచ్చి బంధువులను, స్నేహితులను, ఊరిని చూసుకొని ముచ్చటించుకునే ఆటపాటల పూల పండుగ. బతుకమ్మ తొమ్మిది రోజుల స్త్రీల పండుగ. ఆశ్వయుజ మహాలయ అమావాస్యతో 'ఎంగిలిపూలు' పేరుతో మొదలై దుర్గాష్టమినాటి 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తుంది.

పల్లెలో, వెదురు సిబ్బుల్లో పచ్చని ఆకులు (గుమ్మడి ఆకులు) పరిచి వాటిపై దొంతరలుగా రంగు రంగుల పూలవరుసలను ముందుగా గుమ్మడి పువ్వుల్ని, తంగేడు, గునుగు, పుచ్చలా పువ్వా, బీర, గన్నేరు, మందారం, బంతి, చామంతి వంటి రకరకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి పైన పసుపు చేసిన గౌరమ్మను ఉంచి పూజిస్తారు. ప్రకృతిని ఆరాధిస్తూ బంగారు భవిష్యత్తుకు ఎలాంటి ఆపదా రాకుండా బతుకు నిండు నూరేళ్లు పండుగలా సాగాలని గౌరీమాతను పూజించడమే బతుకమ్మ పండుగ. బతుకమ్మను పేర్చాక పసుపుతో గౌరమ్మను తయారు చేస్తారు. బతికించి కోరిక తీర్చే అమ్మగా గౌరీమాతను మహిళలు పూజిస్తారు. పెళ్లికాని అమ్మాయిలు మంచి భర్త రావాలని, పెళ్లయిన స్త్రీలు నిండు నూరేళ్లు తన భర్త ఆయురారోగ్యాలతో బాగుండాలని బతుకమ్మను పూజించడం ఈ పండుగ ప్రత్యేకత.

తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వివిధ పేర్లతో పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ.

ఇలా తొమ్మిది రోజులు పూలను త్రిభుజాకారంగా పేర్చి పూజించడం, పండుగ చేయడం తెలంగాణలోని సంస్కృతిలోని సంస్కృతిలో ఒక ప్రత్యేకతగానే చెప్పవచ్చు.

బతుకమ్మ పండుగకు స్త్రీలు అనేక రకాల పాటలు పాడతారు. ఒక స్త్రీ పాట పాడగా మిగతావాళ్లు ఆ పాటకి వంత పాడతారు. ఉయ్యాల, వలలో, కోలో, తుమ్మెద, రామ చిలుకా, ఓ రాచగుమ్మడి, మల్లియలో, చందమామ, గౌరమ్మా మొదలైన వంత పదాలు పాడి ఆ పాటను రక్తి కట్టిస్తారు. చేతులతో చప్పట్లు లేదా కోలాటంతో స్త్రీలు సామూహిక స్వరాలతో వినసొంపుగా పాడడం ఈ పాటల సహజత్వం. బతుకమ్మ పండుగకు సంబంధించి ఏ సందర్భమైనా పాటతో ముడి పడి వున్న అంశమే. ఇటువంటి సంబంధాల పాటలను కొన్నింటిని పరికించి చూద్దాం...

తెలంగాణలో బతుకమ్మ పండుగకు అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లలను కచ్చితంగా పిలుచుకోవాలి, శక్తిమేరకు చీరె, రవికెలు పెట్టి సాగనంపుకోవాలి. మొత్తంగా చూస్తే ఊళ్లోంచి బయటకు వెళ్లినవారు తిరిగి ఊరికి చేరుకోవడం, కష్టసుఖాలు మాట్లాడుకోవడం ఈ పండుగ విశేషంగా కనిపిస్తుంది.

ఈ క్రమంలో అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లలను పిలుచుకొని వచ్చే సందర్భంలో ఓ పాట..

"సిన్నోడ సిరికృష్ణ ఉయ్యాలో.. సెల్లెను తీస్కరార ఉయ్యాలో
నడిపోడు వుండంగ ఉయ్యాలో.. నాకేమి అక్కెర ఉయ్యాలో
నడిపోడ నారాయణ ఉయ్యాలో.. సెల్లెను తీస్కరార



ఉయ్యాలో
నాకేమి అక్కెర ఉయ్యాలో... అంటే కుటుంబంలో పెద్దవారు ఆడపిల్లను పుట్టింటికి తీసుకువస్తారు కదా. అప్పుడు ఆ తల్లిదండ్రులు..
"పెద్దోడ పెరుమాండ్ల ఉయ్యాలో సెల్లెను తీస్కరార ఉయ్యాలో" ఇలా ఆ ఇంటి ఆడపిల్లను బతుకమ్మ పండగకు పిలుచుకునే చక్కని సందర్భాన్ని తలపించే పాట.
అలాగే తెలంగాణలోని బతుకమ్మ పండుగ విశిష్టతను తెలిపే మరో బతుకమ్మ పాటను పరికిస్తే..
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
తంగేడు గునుగులో ఉయ్యాలో
తరలివచ్చెను ఉయ్యాలో
గౌరమ్మ రూపానివే ఉయ్యాలో బంగారు తేజానివే ఉయ్యాలో
ఇలా ఈ పాట సాగుతుంది.
తెలంగాణలో బతుకమ్మ పండుగకి సంబంధించి అందరి నోళ్లలో నానే పాట:
ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ ఏమేమి కాయొప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ తంగేడు కాయొప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వులో.. తంగేడు కాయలో... అంటూ సాగే ఈ పాటలో బతుకమ్మని పేర్చటానికి ఏయే పూవులు వాడతారో లయబద్ధంగా చెప్పే పాట.
బతుకమ్మని గురించి జనుల వ్యవహారంలో ఉన్న మరో ప్రముఖమైన పాట..
రామ రామ రామ ఉయ్యాలో రామనె శ్రీరామ ఉయ్యాలో
రామ రామ నంది ఉయ్యాలో
రాగమెత్తరాదు ఉయ్యాలో
నెత్తి మీద సూర్యుడా ఉయ్యాలో
నెలవన్నెకాడ ఉయ్యాలో
...
పెద్దలకు వచ్చింది ఉయ్యాలో
పెత్తరామాస ఉయ్యాలో
బాలలకు వచ్చింది ఉయ్యాలో బతుకమ్మ పండుగ ఉయ్యాలో అంటూ బతుకమ్మల చుట్టూ చేరి మహిళలు చప్పట్లతో పాటకు అనుగుణంగా గుండ్రంగా తిరుగుతూ ఆట ఆడతారు.
బతుకమ్మ పండుగలో ఆట, పాట,



మనిషికి మనిషికి ఉండే బంధం, విలువలు, సంస్కృతి, సహకారం దాగి ఉంది. స్త్రీలంతా ఈ పండగ తొమ్మిది రోజులు ఒకరికొకరు సహకారంతో బతుకమ్మను పేర్చుకోవడం, అందుకుగాను కుటుంబంలో అందరి సాయం, ఆనందోత్సాహాలు ఉంటాయి.
బతుకమ్మ పాటల్లో మరో పాట..
గుంపు గుంపు గునుగుల్లా నేరియాలో
గుంపు గునుగు పూల నేరియాలో
తెంపరాదె నాయన్న నేరియాలో
గుల్లల్ల నింపరాదె నేరియాలో...
బతుకమ్మ పండుగలో గౌరిపూజ ప్రాశస్త్యం పొందిన పాట
శ్రీగౌరి నీ పూజ ఉయ్యాలో
చేయబూనిమమ్మ ఉయ్యాలో
కాపాడు మమ్ముల ఉయ్యాలో
కైలాసరాణి ఉయ్యాలో..
...
ఊరికి ఉత్తరాన వలలో ఊడలా మర్రి వలలో
...
చద్ది అన్నం తిని వలలో సాగించు కొలిమి వలలో
పాల అన్నం తిని వలలో పట్టెనే కొలిమి వలలో
అంటూ మనిషి జీవన పోరాటం, వృత్తి మొదలైన అన్ని వ్యవహారాలు, అలవాట్లు మొత్తంగా చూస్తే జీవితాల్నే దర్శించినట్లు ఉండటం బతుకమ్మ పాటల విశేషం.
ఈ విధంగా ఎన్నో పాటలు బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని తెలియచేస్తాయి.
తెలంగాణ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక బతుకమ్మ సంబురాలు మరింత ఘనతికెక్కాయి. తెలంగాణ ప్రజల సంస్కృతి సాంప్రదాయాలు మిన్నంటేలా బతుకమ్మ సంబురాలు నిర్వహించుకోవడం చెప్పుకోదగ్గ విశేషం. పల్లెలోని బతుకమ్మ పట్టణాల్లోనూ వీధి వీధిలో అంబరాన్నంటే సంబురాల్లా వేడుకలు నిర్వహించడం తెలంగాణ ప్రజలు తమ సంస్కృతికి, పండుగలకు ఇచ్చే ప్రాధాన్యతని తెలియజేస్తుంది.
అంతేకాకుండా దేశ విదేశాల్లోనూ ప్రవాస భారతీయులు బతుకమ్మ పండుగను జరుపుకోవడం గర్వించదగ్గ విషయం.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలోని అన్ని ప్రాంతాలు బతుకమ్మ చారిత్రిక విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించడం తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవంగా చెప్పుకోవచ్చు.

# తీపి ప్రియులు

**బొందల నాగేశ్వరరావు**

**రాఘవ్ భార్య పంకజం, భర్తకు షుగరుందని ఆయన్ను భయపెట్టి నిత్యం కూరల్లో ఏదో రకంగా కాకరకాయను కలిపి భోజనం పెడుతోంది. రాఘవ్ కూడా కిమ్మనకుండా భోంచేసేవాడు.**

**ఆ రోజు కూడా కాకరకాయ కూర, కాకరకాయ వేపుడుతో భోజనం వడ్డించింది పంకజం.**

కంచం ముందు కూర్చొన్న రాఘవ్ తప్పదన్నట్టు భోజనం ముగించుకుని చేదు తెలియకుండా వుండటానికి తను రహస్యంగా తెప్పించుకున్న నేతి హల్వాను అతి రహస్యంగా తింటూ టీ.వీలో కార్టూన్ బొమ్మలను చూస్తున్నాడు.

అప్పుడు అందాక గదిలో కూర్చొని స్నేహితురాళ్లతో మాట్లాడుకొంటున్న రాఘవ్‌కూతురు తన్వి హాల్లోకొచ్చి టీ.వీ. చూస్తున్న తండ్రి పక్కన కూర్చుంది.

“మేం రడీ నాన్నా! మీరు మమ్మల్ని కార్లో మాల్‌కు తీసుకువెళ్లటమే తరువాయి” అంటూ తండ్రి ముఖంలోకి చూసి “ఏమిటీ! స్వీటు తింటున్నారా? గ్రైండరులో రుబ్బుతున్నట్టు నోటిని తెగ ఆడించేస్తున్నారే!” బెదిరింపు ధోరణితో అంది కూతురు.

“అవునమ్మా! మీ అమ్మ చేసే చేదు కూరలను, వేపుళ్లను తిని తిని నా నాలుక చేదుబారిపోయిందమ్మా. అందుకే రహస్యంగా నేతి హల్వాను తెప్పించుకొని తింటున్నాను. ఈ సంగతి మీ అమ్మకు చెప్పకు. చెపితే నా ఆరోగ్యం కోసం తను బాధపడిపోయి గోలగోలగా నా మీదకు ఒంటి కాలి మీద లేస్తుంది. ఆ..” అన్నాడు రాఘవ్ అమాయకంగా.

తండ్రిపై జాలి కలిగింది కూతురికి. “ఒకే! ఇదే లాస్టు. ఇకపై స్వీట్లు తినకండి” హెచ్చరించింది కూతురు.

ఆ మాటలు కిచెన్‌లో వున్న తల్లి పంకజం చెవిన లీలగా పడ్డాయి. “ఏమిటక్కడ గుసగుసలు! అమ్మాయిలూ.. వారి మీద మీకున్న ప్రేమాభిమానంతో స్వీట్లుగాని పెట్టేరు సుమా! వారికి షుగరు నాలుగు వందలు దాటిందమ్మా!” కేకేసినట్లు అంది పంకజమ్మ.

“అబ్బే! వాళ్లిచ్చినా నేను ముట్టుకోను పంకజం. నీ మీద ఒట్టు. నా ఆరోగ్యం కోసం నువ్వు ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నావో మరి” అని అంటుండగానే రాఘవ్‌కు ఎక్కిళ్లు వచ్చాయి.

మంచినీళ్ల తేవటానికి కిచెన్‌లోకి వెళ్లింది కూతురు తన్వి.

అక్కడ తల్లి కూడా తండ్రి లాగానే నేతి హల్వాను పమిట చాటున దాచుకొని కొద్ది కొద్దిగా విరిచి నోట్లో వేసుకొని తింటున్న విషయం గమనించింది.



కూతురు చూసిందన్న భయంతో వొణికిపోతున్నట్టు గబుక్కున గ్లాసుతో నీళ్ల తీసుకొని తాగి “అమ్మా! నేను గుట్టుగా నేతిహల్వాను తెప్పించుకొని తింటున్న విషయం నాన్నకు చెప్పకమ్మా! ఆయనకు తెలిస్తే ‘గయ్’మంటాడు. అవునమ్మా! ఆయనకు నా మీద అంత ప్రేమ, నా ఆరోగ్యం మీద మరీ శ్రద్ధ” అని కూతురి గడ్డం పట్టుకొంది పంకజం.

“చెప్పనులేమ్మా! అయినా మీరిద్దరూ షుగరు వ్యాధిగ్రస్తులు. మీ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకోవలసింది మీరే! మరి... ఇలా ఒకరినొకరు మోసం చేసుకొంటూ దొంగచాటుగా ఇద్దరూ స్వీట్లు తెప్పించుకొని తింటున్నారే... తప్పు కదూ? నేను జాగ్రత్తలు మాత్రమే చెప్పగలను. కాదూ కూడదు మేం స్వీట్లు తింటామంటే నేనేమి చేయగలను? ఫలితంగా మీరు త్వరగా చెల్లుకొంటారంతే!” అంటూ భయపెట్టి వెళ్లి నీళ్ల చెంబును తండ్రికందించింది. ఆయన నీళ్లు తాగి ప్యాంటు, షర్టు వేసుకొని కూతుర్ని. ఆమె స్నేహితులను కారులో ఎక్కించుకొని ‘మాల్’కు బయలుదేరాడు.

అయితే ఇకనైనా వాళ్లకున్న షుగరువ్యాధి నిమిత్తం అప్రమత్తంగా వుండాలన్న కూతురు మాటల్ని అస్సలు ఖాతరు చేయలేదు సరికదా నిర్లక్ష్యంగానే వుండిపోయారు భార్యాభర్తలిద్దరూ. తత్ఫలితంగా ఇద్దరి శరీరాల్లో షుగరు బాగా పెరిగిపోయి ఇన్సులిన్ ఇంజక్షన్ వాడకం వరకు తీసుకువెళ్లిందా వ్యాధి. అప్పుడు క్రమం తప్పకుండా బిళ్లలు మింగుతున్నా షుగరు తగ్గలేదెందుకోనన్న ఆలోచనలో పడారిద్దరూ.

నాలుగు రోజులు గడిచాయి...

గత నాలుగు రోజులు తన ఆరోగ్యం గురించి అంత తీవ్రంగా ఆలోచించిన రాఘవ్ మళ్లీ నిర్లక్ష్యంగానే వుండిపోయాడు.

కానీ ఆయన భార్య పంకజం మాత్రం వాళ్లకు షుగర్ కంట్రోల్‌లో వుండకపోవటానికి కారణమేమిటో తెలుసుకోవాలనుకొని బాగా ఆలోచించి కారణాన్ని గుర్తించింది.

అలా తనకు, భర్త రాఘవ్‌కు షుగరు కంట్రోల్‌లో లేకపోవడానికి కారణం పక్కింటి అబ్బాయి పాండేనన్న నిర్ధారణకు వచ్చింది. అవును.. ఆ పాండుకి పైసలు కావాలనుకున్నప్పుడల్లా ఆమెను, ఆమె భర్తను ప్రేరేపించి, నేతి హల్వా మీద ఆశను కల్పించి ఒకరికి తెలియకుండా మరొకరిని, ఇద్దరి వద్ద లంచం తీసుకొని నేతిహల్వా తెచ్చి పెడుతున్నాడు. వాడు తెచ్చి పెడుతున్న నేతి హల్వాను తినటం వల్లనే వాళ్లకి షుగర్ కంట్రోల్లోకి రాలేదు. కనుక ఇకపై వాడి చేత నేతి హల్వాను తెప్పించుకోకూడదన్న నిర్ణయం తీసుకొంది పంకజం. పాండుని ఇంటి వైపుకు రాకుండా చేస్తే ఆటోమేటిక్‌గా భార్యాభర్తలిద్దరూ స్వీట్లకు దూరమౌతారు. స్వీట్లకు దూరమైతే షుగర్ పెరగటానికి అస్సలు ఆస్కారమే వుండదు అనుకొంది మనసులో.

ఆ మంచి నిర్ణయాన్ని వెంటనే అమలు పరచింది పంకజం.

ఆ సంగతి భర్త రాఘవ్‌కు చెప్పలేదు.

అందువల్లనేమో రాఘవ్ మాత్రం తనకు స్వీట్ల మీద ధ్యాస మళ్లినప్పుడల్లా పాండు వాళ్లింటికి రాకపోవటానికి కారణం తెలుసుకోవాలనుకొంటూ వుంటాడే తప్ప ఏ రోజూ ఆ విషయాన్ని భయం వల్ల భార్యతో ప్రస్తావించలేదు.

మరో వారం రోజుల తరువాత...

పంకజం భర్త రాఘవ్ పిచ్చిపట్టిన వాడిలా జుట్టు పీక్కొంటూ చూపుడు వేలిని బుగ్గనుంచుకొని ఆకాశం వేపు చూస్తూ సీరియస్సుగా ఆలోచిస్తున్నాడు.

అలా ఆలోచిస్తున్న భర్త వేపు చూసిన భార్య పంకజం తనలో తానే నవ్వుకొని "ఏమిటండీ! దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? నాతో చెప్పుకోరూ?" అని అడిగింది.

అందుకు "ఏం లేదు పంకజం! నాకిప్పుడు స్వీటు తినాలనిపిస్తోంది. నా జిహ్వ నేతి హల్వాను కోరుకుంటోంది. కానీ నేను కోరుకున్నప్పుడల్లా నాకు స్వీట్లు కొని తెచ్చిపెట్టే ఆ పాండుగాడు మనింటి వైపుకు రావడం లేదు. కారణం ఏమైవుంటుందబ్బా?" అని ఆలోచిస్తున్నాను" అన్నాడు

**"పర్వాలేదే! ఎప్పుడూ బుకాయించే తమరు ఇవాళైనా మీకు స్వీట్లు కొనిపెడుతోంది ఆ పాండేనని నిజం ఒప్పుకొన్నారు. నేనే...నేనే వాడ్ని మనింటికి రావద్దని కట్టడి చేసానండీ!" అని నవ్వింది పంకజం.**


అయోమయంగా.

"పర్వాలేదే! ఎప్పుడూ బుకాయించే మీరు ఇవాళైనా మీకు స్వీట్లు కొనిపెడుతోంది ఆ పాండేనని నిజం ఒప్పుకొన్నారు. నేనే...నేనే వాడ్ని మనింటికి రావద్దని కట్టడి చేసానండీ!" అని నవ్వింది.

"నువ్వా! అయితే నీకూ స్వీట్లు కొనిపెడుతోంది వాడేనన్నమాట!" అన్నాడు. "అవునండీ! మీ వద్ద లంచం పైసలు తీసుకున్నట్టు నా వద్దా లంచం తీసుకొని నాకూ వాడే స్వీట్లు కొని తెచ్చిపెట్టేది. అందువల్ల మనిద్దరి ఆరోగ్యాలు ఆ పాండువల్ల పాడవుతున్నాయని గ్రహించి వాడ్ని మనింటికి రావద్దని గట్టిగా చెప్పాను. అందుకే వాడు ఇటువైపు రావటం లేదు" అని భర్తకు సమాధానం చెప్పింది.

"అలాగా!" ఆశ్చర్యంతో అన్నాడు.

"అవునండీ!" అని భర్తకు సమాధానం చెప్పి, తన మనసులో 'తీపి విషమని తెలిసీ ఒకరికి తెలియకుండా మరొకరం ఇద్దరం స్వీటు తెప్పించుకొని తింటూ స్లో పాయిజన్‌తో ఆరోగ్యాన్ని పాడు చేసుకొన్నాం ఇన్నాళ్లు. అది తప్పు. అందుకే ఆ పాండుగాడిని మా ఇంటి వేపుకు రానివ్వకుండా చేశాను. ఇకపై కూడా ఎంతటి కమ్మని స్వీటైనా సరే నేను తినను, వారినీ తిననివ్వను' అనుకొంటూ సోఫాలో కూర్చొంది పంకజం. ●







## చంద్రమండలం


సుబ్బారావు: అప్పారావ్, ఏమైంది? చాలా నీరసంగా కనిపిస్తున్నావు.

అప్పారావు: మా ఆవిడ గొంతెమ్మ కోరికలు తీర్చలేక ఇలా అయిపోయాను సుబ్బారావ్.

సుబ్బారావు: కొత్తగా మళ్లీ ఏం కావాలంటోంది?

అప్పారావు: చంద్రమండలానికి తీసికెళ్లమంటోంది.

సుబ్బారావు: ఆ... అంటూ కిందపడిపోయాడు.



## ఉమెన్స్ కాలేజీ పక్కన

రాజారావు: ఇంత చిన్న ఇంటికి అద్దె మరీ ఎక్కువ చెప్తున్నారు.

ఇంటి యజమాని: ఉమెన్స్ కాలేజీ పక్కన ఇల్లు కావాలంటే మీరు అనుకున్నంత చవగ్గా ఎలా వస్తుంది?

**- వైదా ఈశ్వరరావు,** మింది, విశాఖపట్నం

## వర్చువల్ విండో షాపింగ్

"మా అమ్మ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో విండో షాపింగ్ చేస్తుంది" గొప్పగా చెప్పింది, రాధ తన క్లాస్‌మేట్ గోపితో.

"పోదు బడాయి.. మా అమ్మ అంత కష్టపడదు. ఆన్‌లైన్ మార్కెటింగ్ వెబ్‌సైట్లలో వర్చువల్ విండో షాపింగ్ చేస్తుంది" మరింత గొప్పగా చెప్పాడు, గోపి.

రాధ దగ్గర ఇక మాటలేముంటాయి?

**- కె.లహరి,** కరీంనగర్

# నిజం, ధర్మం

**యామిజాల జగదీశ్**

"ఎల్లప్పుడూ నిజమే మాట్లాడాలి.. అదే మంచిది" అని ఒకరితో చెప్పాను.

వెంటనే ఆ మనిషి నాతో గొడవకు దిగాడు.

"సార్, మీ ఉపదేశాలు విని మోసపోయే వారెవరైనా ఉంటే వారికి చెప్పుకోండి.. నాకక్కర్లేదు మీ ఉపదేశాలు. నన్నొదలండి బాబూ" అని అక్కడి నుంచి వేగంగా నడవటం ప్రారంభించాడు.

కానీ.. నేను ఊరుకుంటానా ఏమిటీ? ఊరుకోనుగా.

"ఏమిటి విషయం? విషయం పూర్తిగా చెప్పింతర్వాత పరిగెత్తండి" అని చెప్పాను.

ఆయన అన్నాడు కదా..

"ఇదిగో, గత వారం రైల్వే స్టేషన్లో ఓ పెద్ద సూట్ కేసుతో నిల్చున్నాను. పక్కనే ఒకరు నిల్చున్నారు. ఆయనతో "సార్! ఈ సూట్ కేసుని కాస్సేపు చూసుకోండి. అదిగో అక్కడికి వెళ్లి నీళ్లు తాగొస్తాను" అన్నాను.

వెంటనే ఆయన "సరే" అన్నారు.

ఆయన అలా అనడంతో నేను వెళ్లి నీళ్లు తాగొచ్చేసరికి సూట్‌కేసూ లేదు, చూసుకుంటానన్న మనిషీ లేదు" అన్నాడు.

"అయ్యో పాపం" అన్నాను నేను.

"నిజమే మాట్లాడాలి అని చెప్తున్నారు కదా... అందువల్ల ఎదురయ్యేవి కష్టాలే" అన్నాడు.

"ఎలా అని?" అడిగాను.

"సూట్‌కేసుని చూసుకోమని చెప్పడంతోనే ఆ మనిషి పెట్టెలో ఏముందని?" అడిగాడు.

నేను నిజమే చెప్పాలని చెప్పేసాను. పెట్టెలో పదిహేను వందల రూపాయలు ఉన్నాయన్నాను. కానీ జరిగిందేమిటీ? అతను పెట్టెతో సహా ఉడాయించాడు. నిజం చెప్పడం వల్లేగా నాకా కష్టం వచ్చిందన్నాడు.

నిజం మాట్లాడటం అనేది ఉత్తమమైన కార్యం. అందులో సందేహాలు రావాల్సిన అవసరమే లేదు. కానీ ధర్మం అనేది చాలా సూక్ష్మమైనది.

ఏది ధర్మం.. ఏది అధర్మం అని మనకు అర్థం కావడం లేదు. అందుకే నిజమే మాట్లాడాలనుకుని మాట్లాడి లేనిపోని రీతిలో కష్టపడుతుంటాం.


అనగనగా కౌశికుడనే ముని ఉన్నారు. వెంటనే నాకు ఆయన బాగా పరిచయమా అని అడగకండి.. కౌశికుడు ఇప్పటి ముని కాదు. పురాణాల కాలంనాటి మునివర్యులు. అబద్ధమే చెప్పని ముని అని అతనికి పేరుండేది. ఆయన ఒకప్పుడు అడవిలో ఉన్నారు.

అప్పుడు ఓ రోజు భయంతో కొందరు ఆ వైపున పరిగెత్తుకుంటూ వచ్చారు. వారిని చూసి "ఏమిటి విషయం?" అని కౌశికుడు అడిగారు.

"దొంగలు కొందరు మమ్మల్ని తరుముకొస్తున్నారు. వారికి భయపడి మేం పరిగెత్తుకుంటూ వస్తున్నాం" అంటూ అక్కడికి దగ్గర్లోనే ఉన్న ఓ పుట్ట వెనుక దాక్కున్నారు.

వారెక్కడ దాక్కున్నారో కౌశికుడికి తెలుసు. కాస్సేపటికి దొంగలు అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. దొంగలు కౌశికుడిని చూశారు.

కౌశికుడితో దొంగలు "మీరు ఎప్పుడూ అబద్ధం చెప్పరని మాకు తెలుసు. కనుక మీరు మాకు ఒక నిజం చెప్పాలి. మాకు భయపడి కొందరు ఇటు వైపు పరిగెత్తుకుంటూ వచ్చారు. వారెక్కడ దాక్కున్నారో చెప్పండి" అని అడిగారు.



కౌశిక మహాముని అబద్ధం చెప్పరు కదా. ఇప్పుడేం చేయాలి? ఏమాత్రం ఆలస్యం చేయకుండా భయంతో దాక్కున్నవారు ఎక్కడ ఉన్నారో చెప్పేశారు.

దొంగలు తిన్నగా అక్కడికి వెళ్లి వారిని హతమార్చి, వారి దగ్గరున్నవన్నీ తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు.

నిజం చెప్పిన ఆ ముని స్వర్గానికి వెళ్లలేదట. తిన్నగా నరకానికి వెళ్లారట.

ఈ కథను చెప్పింది శ్రీకృష్ణుడు.

అదేమిటీ? విచిత్రంగా... విడ్డూరంగా ఉందే. నిజం చెప్పిన మనిషికి నరకమా? అని అడిగారు.

అందుకు కృష్ణుడు ఇలా చెప్పారు..

"నిజం మాట్లాడటం వల్ల కలిగే మంచి ఓ అబద్ధం మాట్లాడినప్పుడు ఇస్తుందంటే ఆ సమయంలో అబద్ధమే నిజం.

అలాగే అబద్ధం చెప్పడం వల్ల కలిగే హాని నిజం మాట్లాడటం వల్ల ఏర్పడుతుందంటే అక్కడ ఆ నిజమే అబద్ధం.

ఏ ధర్మమైనా సరే, దాని వల్ల ఇంకొకరికి హింస జరుగుతుందంటే అది అధర్మం.

సత్యం మాట్లాడటం వల్ల ఓ కీడు జరుగుతుందనుకోండి... ఆ సమయంలో మౌనంగా ఉండటమే మంచిది. అలాగ ఉండలేకుంటే అబద్ధం చెప్పవచ్చు. అందువల్ల పాపమేమీ లేదు.

పెళ్లి సమయంలోనో, భార్యతో ఏకాంతంలో మాట్లాడుతున్నప్పుడో, ఎవరి ప్రాణానికైనా ముప్పు ఏర్పడుతుందనిపించినా, సరదాగా మాట్లాడుతున్నప్పుడో, ఇలాంటి సమయాలలో అబద్ధం చెప్పడం పాపమేమీ కాదని పెద్దలే చెప్పారు.

అందువల్ల కొన్ని ఇళ్లల్లో చూడండి... ఓ ఇల్లాలు మతిమరుపుతో కాఫీలో చక్కెరకు బదులు ఉప్పు వేసి తీసుకొచ్చి ఇదిగో కాఫీ అంది అని మొగుడి ముందర పెట్టడమే కాకుండా కాఫీ ఎలా ఉందని అడుగుతారు.

అప్పుడు ఆ భర్త కూడా సమయస్ఫూర్తితో ఈ కాఫీకి సాటి ఈ కాఫీయే, మరొకటి లేదనుకో అని అంటారు.

అంతేకాదు, ఆ కాఫీని ఆస్వాదిస్తూ తాగేస్తారు.

నిజం చెప్పి గొడవను కొనితెచ్చుకోవడం ఎందుకని ఆ భర్త అలా చెప్పారని అర్థం చేసుకోవాలి.

ఏది ధర్మం, ఏది అధర్మం అని నిర్ణయించడం ఆ భర్తకు బాగా తెలుసు అన్నమాట.

అర్జునుడికి కృష్ణుడు పాఠం చెప్పాడు. అయితే ఈ భర్త కృష్ణుడు కనిపిస్తే ఆ పరమాత్మకే పాఠం చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# ఆనందంగా జీవించడమూ ఓ కళ

డా॥ బి.మధుసూదన్ రెడ్డి

**మన జీవితాలు భగవంతుడు ప్రసాదించిన అద్భుత వరాలని చెప్పవచ్చు. ఒక చిన్న గదిలో జీవించే వ్యక్తులు అమితానంద డోలికల్లో తేలియాడుతుంటారు. అత్యంత ధనవంతుల్లో ఆనందానికి దూరంగా నిద్రలేమితో భారంగా గడుపుతున్న బతుకులు. నా మిత్రుడికి ఖరీదైన ఆపిల్ ఫోన్ ఉంది, నా వద్ద చవకైన డబ్బా ఫోన్ మాత్రమే ఉంది; మా బంధువుకు పెద్ద బంగళా ఉంది, మాది రెండు గదుల పెంకుటిల్లు మాత్రమే. నా స్నేహితుడు నిత్యం ఖరీదైన డ్రెస్సులు వేస్తాడు, నా వద్ద అతుకుల బట్టలే ఉన్నాయి.**


ఇలాంటి విపరీతమైన అసమంజస ఆలోచనలు మన మనసును అనునిత్యం చెదలువలె తొలుస్తుంటాయి.

## ఓ అద్భుత కళ

ఆనందంగా జీవించడమనేది ఓ అద్భుత కళ. మన సామర్థ్యాలు, నైపుణ్యాలకు పదును పెడుతూ, లక్ష్యాలను ఛేదిస్తూ సుఖ సంతోషాల దుప్పట్లు కప్పుకొని జీవితాన్ని ఆస్వాదించడానికి అడుగులు వేయాలి. మనకు ఉన్నదానితో తృప్తి పడని కలికాలం నడుస్తోంది. ఆకాశానికి నిచ్చెన వేయడం, అర్హతకు మించి అత్యాశ పడడం, గోరంత శ్రమ చేసి కొండంత ఆశించడం పరిపాటైంది. అసాధ్యమని తెలిసీ విఫల యత్నం చేయడమే జీవిత పరమార్థం అని అనుకుంటున్నాం. మనకు అందుబాటులో ఉన్న వస్తువులు, సౌకర్యాలు, వనరులతో తృప్తి చెందక, లేని దానికోసం అర్రులు చాస్తూ సంతోషమయ జీవితాలను దుఃఖ సంద్రంలో ముంచేస్తున్నాం. అర్హత లేని దానికోసం తపిస్తూ చేతుల్లో/మనసుల్లో ఉన్న ఆనంద నిధులు మరిచి గంపెడంత దిగులును మోస్తున్నాం. మన చుట్టు ఉన్న సౌకర్యాలను, వనరులను, ఆస్తులను ఆనందంగా అనుభవించటం మరిచిన నవ్య డిజిటల్ మనిషి లేని దానికోసం తలచి, వగచి, చింతిస్తూ విఫల యత్నం చేసి, అపజయం మూటగట్టుకొని బతుకులను నిరాశల ఊబిలోకి ఈడుస్తున్నాం.

## మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్

మనకు ఎన్నో కోరికలు ఉంటాయి, కొన్ని మాత్రమే సాకారమవుతాయి. మనకు అసాధ్యమయ్యే కోరికలను మదిలో తలచి మనసులో ఉన్న సంతోష క్షణాలను వృధా చేసుకుంటున్నాం. ఆనందానికి అంతు లేదు, దురాశకు మించిన రోగం లేదు. సంతృప్తికి మించిన సంపద లేదు. ఎవరి జీవితం పరిపూర్ణం కాదు. పరిపూర్ణత(పర్‌ఫెక్షన్) సాధించడానికి చేసే ప్రయత్నంలో మనిషి ఉత్తమ స్థితికి(ఎక్సలెన్స్) చేరుకుంటాడు. కొందరు ప్రదర్శించే విపరీత మనో వికల స్థితిని డెన్నిస్ ప్రాగర్ విశ్లేషిస్తూ మనకు ఉన్న దానితో సంతృప్తి చెందడం మరిచిపోయిన మానవుడు తనది కానిది, తనకు లేనిది, తన అర్హతకు తగని దాని కోసం దురాశ పడుతూ నీరసం, నిరాశలను అనుభవించడాన్ని 'మిస్సింగ్ టైల్ సిండ్రోమ్' అని నామకరణం చేశాడు. సిండ్రోమ్ అంటే బహు వ్యాధి లక్షణం. మనది కానిది, మనకు లేని దాని కోసం కాలయాపన చేస్తున్న మనుషులు ఉన్న వాటిలో సంతోష క్షణాలను వెతుక్కోవడం మరిచిపోతున్నారు.



## అర్హతకు మించిన ఆశలే దుఃఖహేతువులు

ఒక అత్యద్భుత రాజ మందిరంలోకి తొలిసారి అడుగిడిన సామాన్యుడు ఆ మందిరంలోని తళతళ మెరిసే ఫర్నీచర్, సోఫాలు, గోడలపై అందమైన పెయింటింగ్‌లు/పోస్టర్లు, పై కప్పుకు వేలాడుతున్న షాండిలియర్స్, ఖరీదైన కర్టెన్ల కదలికలు, ధగధగ వెరిసే విద్యుత్ దీపాలు, పై కప్పుకు అతికించిన అందమైన ఇటాలియన్, మొసాయిక్ టైల్స్ లాంటి అందాల విందులను ఆరగిస్తూ అమితానందంలో మునిగి తేలుతుంటాడు.

పై కప్పుకు అలంకరించిన వేల టైల్స్ అందాలను చూస్తూనే నిర్మించిన శ్రామికుడి కళను చూసి మనసులోనే ఆనంద పారవశ్యంలో మునిగిపోతాడు.

ఆ సువిశాల అందాల మేడ పైకప్పును అన్ని వైపులా చూస్తున్న ఆ వ్యక్తి ఓ మూలన ఒక టైల్ మిస్సైనట్లు గమనించిన మరుక్షణమే తన ముఖంలో ఆనందం మాయమై నిరుత్సాహ మురుగులో పడిపోతాడు. అందంగా అమర్చిన వేల టైల్స్‌ను చూస్తూ ఆనందపడక, పై కప్పులో మిస్సైన ఒక్క టైల్ స్థానాన్ని చూసి నిరాశ పడడం విచిత్రంగా తోస్తున్నది.

ఇలా మన జీవితాల్లో కూడా మనకు దేవుడు ప్రసాదించిన పలు సౌకర్యాలతో తృప్తి పడుతూ ఆనంద పడడం నేర్చుకోవడానికి బదులు అందుబాటులో లేని, ప్రయత్నించినా దొరకని వనరులను తలచుకుంటూ మన బతుకుల్ని చీకటిమయం చేసుకుంటున్నాం.



## మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్ అవలక్షాలు

మన దగ్గర లేనివి, మన అర్హతకు మించిన వాటి కోసం నిరతరం దురాశ పడుతూ, విఫల యత్నం చేస్తూ జీవితాలను నరకప్రాయం చేసుకునే వ్యక్తులను పలు శారీరక, మానసిక అనారోగ్య లక్షణాలు వేధిస్తాయి. అసంతృప్తి, సంతోష లేమి, ఆందోళన, పశ్చాత్తాప పడడం, నిస్సహాయత, ఆత్మన్యూనత, విచారం, నిరాశ, నీరసం, కృతజ్ఞత లేకపోవడం లాంటి అవలక్షణాలు కనిపిస్తూ ఆరోగ్యాన్ని హరిస్తుంటాయి.

## మిస్సింగ్ టైల్స్ సిండ్రోమ్ నుంచి బయటపడే మార్గాలు

భగవంతుడు అందించిన వనరులతో తృప్తి పడుతూ కృతజ్ఞతా పూర్వకంగా ఉండే వారిలో ఆనందం వెల్లివిరుస్తుంది. అనుకున్నవన్నీ జరగవని, జరిగేవన్నీ మంచికని, ప్రాప్తమైనవే మనకు దక్కుతాయని సంతృప్తి చెందడమే విజ్ఞుల పని అని గమనించాలి. మనకు ఉన్న దానితో సంతృప్తి పడడం ఉత్తమమైన, సంతోషకరమయిన జీవన మార్గం అని తెలుసుకుందాం. అన్ని నాకే కావాలనే ఆలోచన అనారోగ్య కారకమని తెలుసుకోవాలి. అత్యాశ అనర్థదాయకం. దురాశ చెదలు మాదిరి మన శరీరంపై దాడి చేస్తుంది. ఇతరులను చూసి ఈర్ష్య పడడం అర్థరహితం, అవాంఛనీయం. ఇలాంటి ప్రతికూల ప్రవర్తనతో నిరాశ ఆవహించిన బతుకుల్లో ఆనందం అదృశ్యం అవుతుంది. ఆనందమే ఆరోగ్యం, ఆరోగ్యమే మహాభాగ్యం. ఆశావహ దృక్పథమే ఆనందానికి హేతువు. నాకు లేదనే నిరాశ ముదిరితే దొంగతనాలు, దోపిడీలు, హత్యలకు కూడా దారి తీయవచ్చు. మనది కానిది, మనకు లేనిదాని గురించి మరిచిపోదాం. మనకు లేని దాని కోసం ప్రయత్నం చేయడం సహజ మానవ ధర్మం. ఈ ప్రయత్నం విజయవంతం అయితే సంతోషం, విఫలమైతే పట్టుదల పెంచుకొని మరో మార్గాన్ని వెతుకుదాం. మనకు అసాధ్యమైన దాని కోసం సమయం వెచ్చించడం అవివేకం. మనకు లేనిదానికి ప్రత్యామ్నాయాన్ని అన్వేషిద్దాం. సాధ్యం కాని వాటిని మరిచిపోవడం ఉత్తమం.

మన ముందు అందుబాటులో ఉన్న వాటితో ప్రేమగా, ఆనందంగా జీవించడమే ఉత్తమ మనిషి పని.

కృతజ్ఞతా భావమే ఆనంద రహస్యం. ఆనందంగా ఉండే వారందరూ కృతజ్ఞత గుణంతో ఉంటారు. కృతఘ్నులు సాధారణంగా ఆనందాన్ని కోల్పోతూ నిరాశల తుఫానులో కొట్టుకుపోతారు. ఆనందమయ జీవితానికి అడ్డుగా నిలుస్తున్న మిస్సింగ్ టైల్(లేని సౌకర్యం)ను గమనించి దూరంగా ఉందాం. మన ముందున్న అనేక టైల్స్ (వనరులు, వసతులు, వస్తువు)ను చూస్తూ, అనుభవిస్తూ సంతోష సాగరంలో ఈదుదాం. మనకు దేవుడు ప్రసాదించిన వనరులతో సంతృప్తికరంగా లేరని, ఆనందంగా ఉండేవారు గుడిసెలోనైనా సుఖంగా నిద్రిస్తారని గుర్తుంచుకోవాలి.

మనకు లేని వనరుల కోసం అత్యాశ పడితే ఆనందం హరిస్తుంది. మన చేతుల్లో ఉన్నదే మన సంతోషానికి కారణం కావాలని కోరుకుందాం, ఆనంద డోలికల్లో విహరిద్దాం, సుఖసంతోషాల ఊయల్లో తేలియాడుదాం. ■



## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

# హిమాలయాల ఔన్నత్యం

షేక్ అబ్దుల్ వాకీం జాని

ప్రపంచంలో సుందరమైన పర్వత శ్రేణిగానే కాక ఎత్తయిన పర్వత శిఖరాలలో ద్విగుణీకృత అందాలు విరజిమ్ముతూ భాసిల్లుతున్నాయి ఆసియాలోని హిమాలయ పర్వతాలు. ఇవి కారాకోరం, హిందూకుష్, తోబా కాకర్, చిన్న పర్వత శ్రేణులైన పామిర్ కోట్ వరకు వ్యాపించి ఉన్నాయి. భారత ఉపఖండాన్ని టిబెట్ పీఠభూమిని వేరు చేస్తున్నాయి. మన దేశంలో ముత్యాల హారంలా అర్ధ చంద్రాకారంలో శ్వేత వర్ణంతో 2,400 కి.మీ. పొడవు, 400 కి.మీ. వెడల్పుతో హిమాలయాలు వ్యాపించి మెరిసిపోతూ కనిపిస్తాయి. హిమాలయ పర్వత పంక్తులు ప్రపంచంలోనే ఎత్తయినవి. వీటిలో ఎవరెస్టు పర్వతం, కాంచనగంగ మొదలుకొని అనేక శిఖరాలున్నాయి. ఈ పర్వత పంక్తుల్లో సుమారు నూరు శిఖరాలు 7,200 మీటర్ల ఎత్తుకు మించి వున్నాయి. హిమాలయ పర్వతాలు భారతదేశానికి ఉత్తరాన నెలకొని ఉన్నాయి. ఇంతటి అద్భుతమైన మంచు శిఖరాల పుట్టుక కొన్ని మిలియన్ల సం॥ క్రితం జరిగి ఉంటుందని పరిశోధకుల అంచనా. భూటాన్, చైనా, భారతదేశం, నేపాల్, పాకిస్తాన్ ఇత్యాది అయిదు దేశాలలో వ్యాపించి వున్న హిమాలయాలు సింధు, గంగ, బ్రహ్మపుత్ర మొదలైన స్వచ్ఛమైన నదులకు పుట్టినిల్లు. టిబెట్‌వారు హిమాలయాలను 'క్యూమోలంగ్మా' అని పిలుస్తారు. అంటే ప్రపంచానికే తల్లిదేవత అని అర్థం. ఎవరెస్ట్ పర్వతాన్ని మన దేశంలో కొన్ని ప్రాంతాలవారు సాగరమాత అని పిలుస్తారు. హిమాలయాలలో ప్రపంచంలోనే ఎత్తయిన పర్వత శిఖరాలు వందకు పైగా ఉన్నాయని అంచనా. వాటిలో ఎవరెస్ట్ శిఖరం అన్నింటికంటే ఎత్తయినదిగా భాసిల్లుతోంది.

## ఎవరెస్ట్‌కు ఆ పేరు ఎలా వచ్చింది?

ఎవరెస్ట్ శిఖరానికి ఆ పేరు రావడానికి చిన్న గాథ ఉంది. బ్రిటిషు సర్వేయర్ జనరల్ జార్జి ఎవరెస్ట్ తన బృందంతో 1856లో హిమాలయాల పర్వతాలను సందర్శించారు. ఈ పంక్తులలో 15 శిఖరాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో అన్నింటి కంటే 15వ శిఖరం చాలా ఎత్తయినదిగా కనుగొన్నారు. అప్పటికీ ఈ శిఖరానికి ఎటువంటి పేరు లేదు. సర్వేయర్ జార్జి ఎవరెస్ట్ తన పేరు వచ్చేలా మౌంట్ ఎవరెస్ట్ అని 15వ శిఖరానికి నామకరణం చేశారు. ఎవరెస్ట్ కంటే ఎత్తయిన శిఖరం చైనాలో ఉందనే వాదన ఉంది. అయితే దీనికి కచ్చితమైన ఆధారాలు లేవు. మరికొంత కాలానికి కె2 శిఖరం ఎవరెస్ట్ కంటే



ఎత్తయినదనే వాదన బయలుదేరింది. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్‌టన్‌కు చెందిన డాక్టర్ గాడ్విన్ ఆస్టెన్ ఎవరెస్టు కన్నా 36 అడుగుల ఎత్తును కె-2 శిఖరం కలిగి వుందని ప్రకటించారు. ఆ కారణంగానే కె 2 శిఖరాన్ని గాడ్విన్ అంటారు. ఈ విషయమై అనేకమంది అధ్యయనం చేసి డాక్టర్ స్టెయిన్ అంచనా తప్పని తేల్చి చెప్పారు.

1856కు పూర్వం ముందుగా కె 2 ఎత్తయినదిగా ఎవరూ గుర్తించలేదు. కాంచన గంగ అనే పేరు గల హిమాలయ పర్వత శిఖరాన్ని ఎత్తయినదిగా భావించేవాళ్లు. ఎందుకంటే పర్వతాల ఎత్తును కొలిచేందుకు తగిన సామర్థ్యం, పరికరాలు ఉండేవి కావు. అంతేకాక శిఖరం ఎత్తును కొలవడానికి పక్కన ఉండే ప్రదేశం అంత అనుకూలంగా ఉండేది కాదు. అందువలన దాని సరైన ఎత్తును నిర్ధారించలేకపోయారు. అప్పటివరకు భావించే హిమాలయ శిఖరాల ఎత్తు సరైనది కాదేమో? అన్న ఆలోచన అప్పటి సర్వే ఆఫ్ ఇండియా ఆంగ్లేయ అధికారులకు కలిగింది. దీనితో ఆ అధికారులు హిమాలయ పర్వత శ్రేణిలో ఉన్న శిఖరాలను రీసర్వే చేయాలని నిర్ణయించుకున్నారు. 1856లో సర్వే ఆఫ్ ఇండియాకి చెందిన ఆంగ్లేయ అధికారులు ఆధునిక పరికరాలతో ఎవరెస్ట్‌ను కొలిచి 8848.86 మీటర్లుగా చెప్పారు. 19వ శతాబ్దంలో కొలిచిన ప్పుడు దీని ఎత్తు 8,840 మీటర్లుగా పరిగణించారు. ఆ తరువాత 8,888 మీటర్లు అని ప్రకటించారు. ఇటలీకి చెందిన ఒక ప్రొఫెసర్ కె 2 శిఖరం ఎత్తు 8,611 మీటర్లు అని తేల్చి చెప్పాడు. అంతేకాక ఎవరెస్ట్ ప్రతి ఏడాది 18 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలంటే నేపాల్ వెళ్లవలసిందే. ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ గురించి 1856 వరకు ప్రపంచానికి తెలియదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఎవరెస్ట్ శిఖరం చైనా, నేపాల్ దేశ సరిహద్దులతో పాటు టిబెట్, నేపాల్ మధ్య కూడా విస్తరించి ఉంది. పర్వత ఎక్కువ భాగం మాత్రం నేపాల్‌లో ఉండటంతో నేపాల్‌కు చెందినదిగా భావిస్తారు. దీనిని 'గౌరీ శంకర శిఖరం' అని కూడా అంటారు.

## ఎవరెస్ట్ అధిరోహించినవారు

న్యూజిలాండ్‌కు చెందిన సాహసి, తేనెటీగల వ్యాపారి ఎడ్మండ్ హిల్లరీ, మంచుపులిగా ప్రసిద్ధి చెందిన అతని సహాయకుడు, పర్వతారోహకుడైన టెన్సింగ్ నార్కే ఎవరెస్ట్ శిఖరంపై అడుగు పెట్టిన తొలి మానవులుగా గౌరవం పొందారు. 1953 మే 29న వీరిద్దరూ ఎవరెస్ట్‌ను అధిరోహించారు. ఆ తరువాత 1984లో బచేంద్రిపాల్ అనే ఆమె ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు.

ఈమె తదుపరి సంతోష్ యాదవ్ అనే మహిళ రెండు సార్లు ఎవరెస్ట్‌ను అధిరోహించారు. 1992లో 32 మంది పర్వతారోహకులు అయిదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎవరెస్ట్‌ను ఒకే పర్యాయం అధిరోహించడం విశేషం.

ఎవరెస్ట్ అధిరోహించిన తొలి దివ్యాంగ మహిళ అరుణిమ సిన్హా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు పర్వతారోహకులు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఇప్పుడు అనేకమంది సాహస యాత్రికులు ఎవరెస్ట్‌ను అవలీలగా ఎక్కేస్తున్నారు.

## నేపాల్‌లో ఎత్తయిన హిమాలయ శిఖరాలు

నేపాల్‌లో ఎవరెస్టుతో పాటు మరికొన్ని శిఖరాలు ఉన్నాయి. వాటిలో ఒకటి మఖాలు. దీని ఎత్తు 8,481 మీటర్లు. ఇంకో శిఖరం పేరు దౌలగిరి. దీని ఎత్తు 8,172 మీటర్లు. నేపాల్‌లోని మరో శిఖరం పేరు అన్నపూర్ణ. దీని ఎత్తు 8,078 మీటర్లు. ఇంకో శిఖరం పేరు గుర్లమందాట. దీని ఎత్తు 7,728 మీటర్లు.

## భారతదేశంలో ఎత్తయిన శిఖరాలు

వీటిని రెండు భాగాలుగా విభజించారు. పూర్తిగా భారతదేశంలో ఉన్న ఎత్తయిన హిమాలయ శిఖరాలు, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నెలకొని వున్న శిఖరాలు. పూర్తిగా భారతదేశంలో ఉన్న ఎత్తయిన శిఖరాలు కాంచన గంగ (8,598 మీటర్లు), నందాదేవి (7,817). కామెట్ శిఖరం(7,756, ఉత్తరాఖండ్), నాంచబర్వ(7,756 అరుణాచల్‌ప్రదేశ్), బద్రీనాథ్(7,138 మీటర్లు, ఉత్తరాఖండ్), కేదార్‌నాథ్(6,940 మీటర్లు).

**కాంచన గంగా:** ఇది సిక్కిం రాష్ట్రంలో ఉంది. ఇది ప్రపంచంలోనే మూడవ ఎత్తయిన పర్వతం. దీని శిఖరం ఎత్తు 8,598 మీటర్లు, కాంచన గంగా భారతదేశంలోని సిక్కిం రాష్ట్రం, నేపాల్ సరిహద్దుల్లో అయిదు శిఖరాలతో అలరారుతుంది. దీని అధిరోహణ చేయడానికి సరైన మార్గం నేపాల్ నుండే ఉంది. 1852 వరకు ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వతంగా భావించబడినప్పటికీ, ఇప్పుడు ఇది ప్రపంచంలోనే మూడవ ఎత్తయిన శిఖరంగా ప్రసిద్ధి చెందింది.

## నందాదేవి శిఖరం

ఇది ఉత్తరాఖండ్‌లో ఉంది. కాంచన గంగా తరువాత ఎత్తయిన పర్వత శిఖరం నందాదేవి. నందాదేవి శిఖరం పూర్తిగా భారత భూభాగంలోనే ఉంది. ఇది 7,817 మీటర్ల ఎత్తును కలిగి భారతదేశంలో రెండవ ఎత్తయిన శిఖరంగా విరాజిల్లుతోంది. నందాదేవి అనే పేరు 'ఆనందాన్నిచ్చే దేవత' అని అర్థం. దీనిని గర్వాల్, కుమాన్ హిమాలయాలలో స్థానికులు పోషక దేవతగా భావిస్తారు. పర్వతం చుట్టూ ఉన్న నందాదేవి నేషనల్ పార్క్ 1988లో



యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు. ఒక ముఖ్యమైన శిఖరం అయినప్పటికీ, నందాదేవి ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతాలలో ఒకటి. నందాదేవి శిఖరానికి 24 కి.మీ. దూరంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన జాతీయ ఉద్యానవనం ఉంది. నందాదేవి పుష్పలోయలో 50కు పైగా మొక్కల రకాలు, వందకు పైగా పక్షిజాతులు, నీలి రంగు గొర్రెలు, తెల్ల చిరుతలు, ఎలుగుబంట్లు కనిపిస్తాయి. ప్రకృతి ప్రేమికులు ఈ లోయను సందర్శించడానికి తండో పతండాలుగా వస్తుంటారు. హిమాలయాలలో ఇంకా అనేక ఎత్తయిన శిఖరాలు మన దేశంలో ఉన్నాయి. కామెట్ శిఖరం, 7,756 మీటర్ల ఎత్తుతో భారతదేశంలోని మూడవ ఎత్తయిన శిఖరంగా విరాజిల్లుతోంది. గర్వాల్ హిమాలయాలలో ఉన్న కామెట్ జస్కర్ పర్వత శ్రేణిలో ఒక భాగం. దాని చుట్టూ ఇతర ప్రముఖ శిఖరాలు ఉన్నాయి. సాల్టోరో కాంగ్రీ భారతదేశంలోని నాల్గవ ఎత్తయిన పర్వత శిఖరం. ఇది 7,742 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది కారాకోరం శ్రేణిలోని సాల్టోరో పర్వతాల ఉప శ్రేణిలో ఎత్తయిన పర్వత శిఖరం. సాల్టోరో కాంగ్రీ పర్వత శ్రేణి రెండు శిఖరాలకు నిలయంగా ఉంది. జమ్మూ-కాశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతంలోని కారకోరం శ్రేణిలో ఉన్న ససేర్ కాంగ్రీ ఆకట్టుకునే పర్వత శిఖరం. ఇది భారతదేశంలోని ఐదవ ఎత్తయిన శిఖరం. దీని ఎత్తు 7,672 మీటర్లు. ఐదు అద్భుతమైన శిఖరాలతో పాటు అద్భుతమైన వీక్షణలకు ప్రసిద్ధి చెందింది. జమ్మూ-కాశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతంలో ఉన్న మమోస్టాంగ్ కాంగ్రీ మరొక అద్భుతమైన పర్వత శిఖరం, రిమో శిఖరం జమ్మూ-కాశ్మీర్‌లోని కారకోరం శ్రేణులలో ఉన్న ఒక ప్రముఖ పర్వత శిఖరం. ఇది రిమో ముజ్తాగ్‌లో భాగం. నాలుగు పర్వత శిఖరాలను కలిగి ఉంది, రిమో సముద్ర మట్టానికి 7,385 మీటర్ల ఎత్తులో ఉంది.

ఉత్తరాఖండ్‌లోని పితోరాఘర్ జిల్లాలో ఉన్న మరొక అద్భుతమైన పర్వత శిఖరం హార్దియోల్. ఇది భారతదేశంలో ఎనిమిదవ ఎత్తయిన శిఖరం. ఇది 7,151 మీటర్ల ఎత్తును కలిగి వుంది. ఈ పర్వత శిఖరాన్ని 'దేవుని దేవాలయం' అని పిలుస్తారు. ఇది కమాన్ హిమాలయాలలో అత్యంత ప్రసిద్ధి చెందిన శిఖరాలలో ఒకటి. భారతదేశంలో తొమ్మిదవ ఎత్తయిన శిఖరం చంకంబ శిఖరం.

ఇది ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ హిమాలయ ప్రాంతంలో ఉన్న గంగోత్రి సమూహంలో ఒక భాగం. గంగోత్రి గ్రూప్‌లో నాలుగు శిఖరాలు ఉన్నాయి. వాటిలో చౌఖంబ అత్యున్నత స్థానాన్ని కలిగి వుంది. నాలుగు శిఖరాలు ఒకదానికొకటి దగ్గరగా ఉన్నందువల్ల దీనికి చౌకంబ అని పేరు వచ్చింది. పర్వత శిఖరం గరిష్ఠ ఎత్తు 7,138 మీటర్లు. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో ఉన్న మరొక మనోహరమైన పర్వత శిఖరం త్రిసూల్.

ఈ శిఖరం మూడు శిఖరాలను కలిగి ఉంది. ఇంకా అనేక ఎత్తయిన శిఖరాలతో నయనానందం చేస్తున్న హిమాలయాలు ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

# వందనం వరాలనిచ్చే సాధనం

టి.జ్ఞాన ప్రసూన

**గురువు.. తల్లి.. తండ్రి- వీరిని గౌరవించడం, భక్తి ప్రపత్తులతో నమస్కరించడం- వ్యక్తి వినయ విధేయతలకు ఆనవాళ్లు.**

గురువు ఎదుట కుర్చీపైగానీ, పక్కపైగానీ కూర్చోకూడదు. ఒకవేళ వారు వచ్చే సమయానికి కూర్చుని వుంటే వారిని చూడగానే లేచి నిలబడి ప్రణామం చేయాలి. పెద్దవారు, గురువులు ఎదురైనప్పుడు చిన్నవారి హృదయం ఉద్విగ్నమవుతుంది. చిన్నవారు పెద్దలకు వంగి నమస్కరిస్తే ప్రాణాలు స్థిమిత పడతాయని అంటారు. పెద్దలకు సేవ చేస్తూ నమస్కరించి ఆశీస్సులందుకొంటూ వుంటే ఆ వ్యక్తి జీవితంలో విద్య, కీర్తి, బలం పెరగడమే కాకుండా ఆయుష్షు కూడా పెరుగుతుందిట!

**"అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః ।**

**చత్వారి సమ్యగ్వర్ధంతే ఆయుః ప్రజ్ఞా యశోబలమ్ ॥**

స్త్రీలకు నమస్కరించేటప్పుడు ఆ స్త్రీతో తమకు ఎట్టి బంధుత్వం లేకపోతే మర్యాదగా 'తమరు' అని నమస్కరించాలి. లేకపోతే 'సోదరీ' అనాలి. బాబాయి, మామయ్య, మామగారు, ఋత్విక్కు గురువులకు ప్రణామం చేస్తూ వారి పేర్లు పలుకకూడదు.

పిన్ని, మేనమామ భార్య, మేనత్త, అత్తగారు, గురుపత్ని.. వీరందరూ గౌరవించవలసినవారు, తగినవారు పూజింపతగ్గవారు. పెద్దన్నగారి భార్యని తల్లిగా భావించి గౌరవించిన వారికి విష్ణులోక ప్రాప్తి. తండ్రి సోదరి, తల్లిసోదరి, తన సొంత పెద్దక్క.. ఈ ముగ్గురూ జననీ సమానులు. సొంత తల్లి వీరందరి కంటె గొప్పది. కొడుకు, స్నేహితులు, మేనల్లుడు.. వీరిని తనతో సమానం అనుకోవాలి. గొప్పతనానికి కారణాలు ఐదు. ఒకటి ధన సంపత్తి, రెండు బంధుత్వం, మూడు స్థితి, నాలుగు వృత్తి, అయిదు విద్య. వీటన్నిటిలో శ్రేష్ఠమైనది విద్య.

రథము మొదలైన వాహనాలపై ఎక్కి వయోవృద్ధులు, రోగులు, గర్భిణులు, స్నాతకులు, రాజు, పెళ్లికొడుకు మనకెదురుగా వస్తే మనం వారికి దారినివ్వాలి. వీరందరూ కలిపి ఒకేసారి వస్తే ముందు రాజుకు, స్నాతకునికి దారినివ్వాలి. ఈ ఇద్దరిలోకి స్నాతకునికే ప్రథమ స్థానం.

ఏ బ్రాహ్మణుడు అయితే శిష్యుడికి ఉపనయనం చేయించి యజ్ఞం, విద్య, ఉపనిషత్తులు, వేదాధ్యయనం చేయిస్తాడో ఆ వ్యక్తి గురువు. జీవనోపాధి కోసం వేదంలో ఒక భాగం బోధిస్తాడో ఆయన ఉపాధ్యాయుడు. గర్భాదానం మొదలైన సంస్కారాల్ని



చేయించి, అన్నం పెట్టి పోషించిన వారిని గురువులంటారు. వేద ధ్వనితో మన రెండు చెవులను నింపిన వారిని తల్లిదండ్రులుగా భావించి జీవితాంతం వారిని గౌరవించాలి. ఎన్నడూ వారి పట్ల ద్వేష భావం తగదు.

ఉపాధ్యాయుని కంటే పది రెట్లు గౌరవం ఆచార్యులకి, ఆచార్యుల కంటే వంద రెట్లు గౌరవం తండ్రికి, తండ్రి కంటే వెయ్యి రెట్లు ఎక్కువ గౌరవం తల్లికి ఇయ్యాలి.

**ఉపాధ్యాయాందశాచార్య, ఆచార్యాణాం శతం పితా**

**సహస్రేణ పితార్మాతా గౌరవేణాతిరిచ్యతే ॥**

భూమిపై ఎన్ని తీర్థాలు, సాగరాలున్నాయో అన్నిటి స్వరూపమే గురువు. గురువుకు వందనం చేస్తే అది శిష్యుడి కళ్యాణం కోసమే. ఏ గురుదేవుని కృపచేత కీర్తినిచ్చే విద్య సంపాదించాడో ఆ గురువుకు నమస్కరించాలి. ఈ భవ సముద్రాన్ని దాటించే సేతువు గురువుకు నమస్కరించాలి. బ్రాహ్మణుడు సమస్త ప్రపంచానికి నడిచే పుణ్య తీర్థం, భూలోకంలో అవతరించిన విష్ణు స్వరూపం. కనుక నమస్కరించాలి.

**"గురువాక్యంతు కర్తవ్యమ్"**

ధౌమ్య మహర్షి తన శిష్యుడైన అరణిని పిలిచి పొలానికి నీరు పెట్టమన్నాడు, బైదునికి ధాన్యం ఇంటికి చేర్చమన్నాడు, ఒక దున్నపోతుని ఇచ్చాడు, నరహరి శర్మను ఎండిన మేడి కట్టె చిగురించడానికి రోజూ నీరు పొయ్యమన్నాడు. గురువుగారు చెప్పినట్లు చేయడం నా పని వారు అన్న మాటను నిలబెట్టుకోవడం వారి పని అనుకొంటూ శిష్యుడు తన కర్తవ్యం నెరవేర్చాడు. గురువు దృష్టే శిష్యునికి అన్నపానీయాలు.

సర్వకాల సర్వావస్థలయందు ఆత్మనిష్ఠయందే గంభీరుడై వెలయునతడు సద్గురువు. వారికెప్పుడూ స్వపర భేదాలుండవు. తాను జ్ఞాని కనుక ఉత్తముడు, ముక్తుడు. తన చుట్టునున్నవారు అరిషడ్వర్గాలకు బద్ధులై అల్లాడుతున్నారు. వెలుగురేఖ కనిపించని అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు. వారికి జ్ఞానబోధ చేసి ఉద్ధరించడమే తన కర్తవ్యం, ఎవరూ గొప్ప కాదు, ఎవరూ బీద కాదు అంతా ఒకటే. ఎట్టి అవస్థలోనూ గురువు స్థైర్యం చలింపదు, కలత పడదు.

సంసారం నుండి తప్పించుకోవాలని, పరమానందం పొందాలని నిరంతరం తీవ్ర శ్రద్ధతో నుండువాడు వేరు విషయంలో ఇసుమంతైనా ఆసక్తి లేనివాడు అటువంటి శిష్యుడు.

గురువు అనుగ్రహం వాక్కున కతీతం. సూక్ష్మము. దానిని వర్ణింపనలవి కాదు, శరణమే శరణ్యం. వందనమే కృతజ్ఞత. అల్పులైన మానవులకు కలియుగంలో గురువు మీద అచంచలమైన విశ్వాసం కలిగి వుండడం కష్టం. వంగి వందనం చేయడం వలన తనకెంతో చిన్న చూపు అనుకొంటారు. గురువు, తల్లి, తండ్రి ఈశ్వర స్వరూపాలని భావించి సేవించి అనంతమైన ఫలితం లభిస్తుంది. వందనం వరాలనిచ్చే సాధనం.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



అనుకూలంగా ఉంటుంది. ముఖ్యమైన కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయగలుగుతారు. మీ నిజాయితీని రుజువు చేసుకోగలుగుతారు. పరోపకార బుద్ధిని కలిగి వుంటారు. ఉచిత సలహాలను ఇవ్వడం, తీసుకోవడం రెండూ కలిసి రావు. వ్యాపార పరంగా లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. మెలకువతో వ్యవహరించడం మంచిది.

## వృషభం



అనుకూల ఫలితాలను ఎక్కువగా సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. న్యాయ పరమైన చిక్కుల్లో చిక్కుకున్న మీ వారిని రక్షించవలసిన బాధ్యత మీ పైన పడుతుంది. ఇతరులకు మీ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. ఆర్థికంగా పూర్తి స్థాయిలో కాకపోయినా కొంతవరకు ఊరట చెందుతారు. నరఘోష అధికంగా ఉంటుంది.

## మిథునం



ముఖ్యమైన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఏ పని ఎందుకు చేస్తున్నారో మీకు తప్ప ఇతరులకు తెలియనివ్వరు. రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్త రంగాలలో అనుభవం సాధించడానికి శ్రీకారం చుడతారు. విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేస్తారు. మీ నడవడిక పలువురు ప్రశంసించే విధంగా ఉంటుంది.

## కర్కాటం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. పొదుపు పథకాలను పాటించడంలో వైఫల్యం చెందుతారు. మానసిక ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటాయి. మీ మంచితనమే మీకు శ్రీరామ రక్షగా నిలుస్తుంది. చాలా సందర్భాల్లో మీ అంచనాలు తారుమారు అవుతాయి. రోజూ శివ స్తోత్రం పఠించడం మంచిది.

## సింహం



సానుకూల ఫలితాలను సాధించగలుగుతారు. దూర ప్రాంత వ్యవహారాలు ఫలిస్తాయి. రావలసిన ధనం చేతికంది వస్తుంది. అయితే అంతకు మించిన చెల్లింపులు మీరు చెల్లించాల్సి రావడం కష్టతరంగా పరిణమిస్తుంది. శత్రువులు మీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగలుగుతారు. మారుతున్న సామాజిక పరిస్థితులు ఆలోచింపచేస్తాయి.

## కన్య



అనుకూలంగా ఉంటుంది. సంస్థాపరమైనటువంటి పురోగతిని సాధించడానికి కీలకమైన చర్చలను సాగిస్తారు. విలువైన సమాచారం తెలుసుకుంటారు. చురుగ్గా వ్యవహరిస్తారు. ప్రతి పనిని ఒక క్రమ పద్ధతిలో నిర్వహిస్తారు. ధనానికన్నా వ్యక్తిగత గౌరవానికి అధిక ప్రాముఖ్యం ఇస్తారు. గతంలో ఒకరికిచ్చిన మాటను ఈ వారం నెరవేరుస్తారు.

## తుల



అనుకూలంగా వుంటుంది. చాలా కాలంగా ఎదుర్కొంటున్నటువంటి సాంకేతిక ఇబ్బందుల నుండి బయట పడతారు. ఆరోగ్య సమస్యలు తగ్గు ముఖం పడతాయి. ఆదాయ, వ్యయాలలో సమతుల్యతను సాధించడానికి చేసే కృషి నామమాత్రపు ఫలితాన్నిస్తుంది. కీలకమైన వ్యవహారాలలో ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ఇతరులకు ఆచరణ సాధ్యం కానటువంటి పనులను కూడా మీరు చేయగలుగుతారు.

## వృశ్చికం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రతిబంధకాలను అధిగమించి పనులను సానుకూల పరచుకుంటారు. బ్యాంక్ రుణాల విషయంలో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. విభేదాలు తారాస్థాయికి చేరుకోకుండా ఆదిలోనే పరిష్కరించుకుంటే మంచిది. వ్యాపారపరంగా స్వల్పమైన అభివృద్ధిని సాధించగలుగుతారు. వారాంతంలో ఊరటను కలిగించే విలువైన సమాచారం అందుకుంటారు.

## ధనుస్సు



అనుకూలంగా ఉంటుంది. శుభ కార్యాలు సానుకూలపడతాయి. విదేశాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. గృహం/వాహనం కొనుగోలు చేస్తారు. చిన్న చిన్న ఆటంకాలు పనులలో ఏర్పడినప్పటికీ చెప్పుకోదగిన స్థాయిలో ఇబ్బందులేవీ ఏర్పడవు. వృత్తి, ఉద్యోగాల పరంగా వ్యక్తిగత గౌరవం మరింత పెంపొందుతుంది. వారాంతంలో జరిపే చర్చలు సత్ఫలితాలను ఇస్తాయి.

## మకరం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఎంతగానో శ్రమించి అంతంత మాత్రపు ఫలితాలను సాధిస్తారు. బ్యాంకు రుణాలు కలిసి వస్తాయి. ఆస్తుల పరిరక్షణ కష్టసాధ్యంగా పరిణమిస్తుంది. దైవం మీద భారం వేసి ముఖ్యమైన వ్యవహారాలను చక్కబరచుకుంటారు. రెండు పడవల మీద ప్రయాణం శ్రేయస్కరం కాదని తెలిసీ ప్రయోజనాల పరిరక్షణకు ఇటువంటి సాహసాలు చేస్తారు. మీ ధైర్య సాహసాలు వెలుగు చూస్తాయి.

## కుంభం



అనుకూలంగా ఉంటుంది. గతంలో దూరమైన వర్గం తిరిగి ఈ వారం చేరువవుతుంది. సేవకా సిబ్బంది వలన, సహోద్యోగుల వల్ల చెప్పుకోదగిన స్థాయిలో కాకపోయినా ఇబ్బందులేర్పడతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కోర్టు తీర్పులు అనుకూలంగా పరిణమిస్తాయి. మాతృ వర్గీయుల బంధువులకు మీ వంతు సహాయ సహకారాలు అందిస్తారు.

## మీనం



అనుకూల ఫలితాలు ఎక్కువగా గోచరిస్తున్నాయి. పెట్టుబడికి కావలసిన ధనాన్ని ధైర్యం చేసి అప్పు చేస్తారు. రహస్యంగా ముఖ్యమైన చర్చలను సాగిస్తారు. కర్త, కర్మ, క్రియ అన్నీ మీరే అయ్యి సంస్థను ముందుకు నడిపిస్తారు. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటారు. పుకార్లను నమ్మకుండా కంటితో చూసిన విషయాలను నిర్ధారించుకోండి. న్యాయబద్ధంగా నడచుకునే మీ నడవడిక వల్ల ఎంతగానో లాభపడతారు.

# తూర్పు ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంక్ ఉండవచ్చా?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

## దక్షిణ ఆగ్నేయ సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి దక్షిణ ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంకు ఉన్నట్లయితే, దానికి ఏ పోట్లు లేకున్నప్పటికీ సత్ఫలితాలు ఉండవు. ఓవర్ ఫ్లో ఇంటికి తూర్పు ఆగ్నేయం గుండా వెళ్లినట్లయితే చెడు ఫలితాలు తీవ్రతరమవుతాయి. దక్షిణ ఆగ్నేయం గుండా వెళ్లినట్లయితే తీవ్రత తగ్గుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** వ్యయ ప్రయాసలు, ప్రమాదాలు, ఆటంకాలు, అభద్రతా భావం.

### Septic Tank in the South South-East-Unfavourable

A septic tank in the South South-East of the house, even when it does not have any strike, does not give favourable results. If the overflow is towards East South-East of the house the harmful effects get increased, if it is towards South South-East the harmful effects get reduced.

**Result:** Difficulties in spending, accidents, obstacles, feeling of insecurity.

## ఆగ్నేయ సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

పూర్తి ఆగ్నేయ మూలలో సెప్టిక్ ట్యాంకు ఉన్నప్పుడు ఇంటి ఆగ్నేయ మూల నుండిగానీ, స్థలం వాయవ్య మూల నుండి గానీ స్థల ఆగ్నేయ మూలకు తాడు లాగి చూస్తే అది సెప్టిక్ ట్యాంకు మీదుగా పోతుంది. అప్పుడు ఆ ఇంటికి ఆగ్నేయ మూల సెప్టిక్ ట్యాంకు పోటుదోషం వున్నదని గ్రహించాలి.

**శుభా శుభ ఫలితాలు:** చోర భయం, అగ్ని భయం, వ్యర్థ ప్రయాసలు.

### Septic Tank in the South-East(Strike)-Unfavourable

When the septic tank is wholly in the South-East corner of the house and when it does not have any strike, then when a string, held straight from the South-Eastern corner of the house or from the North-Western corner of the plot to the South-Eastern corner, encounters the septic tank it means that the house has the flaw of the South-East corner septic tank.

**Result:** Fear from thieves, heavy losses, futile efforts.

## తూర్పు ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంక్-అశుభం

ఇంటికి తూర్పు ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంక్ వున్నప్పుడు, దానికి పోట్లేమీ లేనప్పటికీ చెడు ఫలితాలే కలుగుతాయి. ఓవర్‌ఫ్లో కూడా తూర్పు ఆగ్నేయం నుండి బయటకు వెళ్లినట్లయితే ఫలితాలు తీవ్రతరమవుతాయి. దక్షిణ ఆగ్నేయం గుండా బయటకు వెళ్లినట్లయితే ఫలితాల తీవ్రత తగ్గుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** అగ్ని ప్రమాదాలు, ధన నష్టం, ఉద్రిక్తతలు, చోర భయం.



### Septic Tank in the East South-East-Unfavourable

A septic tank in the East South-East of the house, even when it does not have any strike, gives unfavourable results. If the overflow is also towards East South-East the harmful effects become increased. If it is towards South South-East the harmful effects get reduced.

**Result:** Fire mishaps, loss of money, outbursts, robberies.

## తూర్పు ఆగ్నేయంలో సెప్టిక్ ట్యాంక్(పోటు)-అశుభం

ఇంటి దక్షిణ గోడ పారు నుండి, తూర్పు ప్రహరీ గోడకు తాడు పట్టి లాగినప్పుడు అది సెప్టిక్ ట్యాంకు మీదుగా పోతే ఆ ఇంటికి తూర్పు ఆగ్నేయం సెప్టిక్ ట్యాంకు పోటుదోషం ఉన్నట్లుగా గుర్తించాలి. ఇటువంటి దోషం చెడు ఫలితాలనిస్తుంది.

**శుభా శుభ ఫలితాలు:** చోర భయం, అధిక నష్టం, అగ్నిభయం, ఉద్రిక్తతలు హెచ్చుగా ఉంటాయి.

### Septic Tank in the East South-East(Strike)-Unfavourable

If a string, held straight from the boundary of the Southern wall of the house to the Eastern compound wall, encounters the septic tank it means that the house has the flaw of the East South-East septic tank. This flaw gives unfavourable results.

**Result:** Robberies, heavy losses, fire mishaps, heavy outbursts.


## తూర్పు(నీచ స్థానం)లో సెప్టిక్ ట్యాంక్-మిశ్రమం

ఇంటికి తూర్పున, తూర్పు మధ్య భాగంలో కాక ఆగ్నేయం వైపుకు సెప్టిక్ ట్యాంకు ఉన్నట్లయితే సత్ఫలితాలుగానీ, దుష్ఫలితాలుగానీ తీవ్రంగా ఉండవు. ఓవర్‌ఫ్లో తూర్పు ద్వారా బయటకు వెళ్లినప్పటికీ, దక్షిణ ఆగ్నేయం ద్వారా బయటికెళ్లినప్పటికీ ఆమోద యోగ్యమే.

**శుభా శుభ ఫలితాలు:** మిశ్రమ ఫలితాలు.

# పదరంగం-10

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. విశ్వకవి బిరుదాంకితుడు (8)
5. పిల్లలకు సోకే 'అమ్మవారు' లాంటిది (2)
6. పెళ్లి సందర్భంగా వరునకు ఇచ్చేది చెదరిపోయింది (4)
7. అరుదు, అతి జాగ్రత్తగా చూడబడేది (4)
8. గదిలో ఉంచి కొడితే ఇది కూడా 'తిరగబడుతుంది'ట (2)
10. కొండెం (2)
13. స్త్రీ (3)
14. మిట్టనేల సరిగా లేదు (3)
15. జనకుని కుమార్తె (3)
16. బాపు ఆప్తమిత్రుడు (6)
18. గొంగళి (3)
19. ఒక ప్రఖ్యాత కేరళ వంటకం (2)
20. తెలుగు రాతలో దీని ప్రయోగం తగ్గింది (4)
21. పండుగలు, పర్వదినాలలో దీనిని చేసుకుని తింటారు (4)
22. నెపము, సాకు (2)

### నిలువు

1. సుమారు (4)
2. పెళ్లిలోని ఒక తంతు (4)
3. కుయుక్తితో చేసే మూకుమ్మడి కుట్ర, మోసం(5)
4. ఈ చీరలంటే స్త్రీలకు మక్కువ (2)
5. నాటుతుపాకీ (3)
9. ఎంతకీ తెగని పేచీ, మోసం (5)
11. నంగనాచి, మాయలమారి తలకిందులైంది (3)
12. జాతీయ జెండా రూపకర్త పైకొచ్చాడు (6)
14. వాడుక భాషలో ఉత్కంఠ రేపే కీలక దశ (5)
15. నేర్పరి, తెలివి గలది (2)
17. శ్రీకృష్ణుడు పుట్టిన ఊరు (3)
19. పౌర్ణమి (3)
20. ఒక(సంగీత సంబంధ) తాళం (2)

## పదరంగం-8 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| న 1 | య | వం 2 | చ | న 3 | | | క 4 | త్తె | ర 5 |
| | | దే | | త్తి | | నే 6 | ల | | ట్టు |
| అ 7 | భి | మా | నం | | ని 8 | | గూ 9 | ర్ఖా | |
| రా | | త | | ప 10 | రం | ప | ర | | ప 11 |
| చ 12 | ద | రం | గం 13 | | త | | గం 14 | ట | లు |
| కం | | | జా 15 | గా | రం | | ప | | గు |
| | తు 16 | వ్యా | యి | | | వి 17 | | న 18 | |
| | పా | | | ప 19 | తి | త | పా | వ | న |
| వ 20 | కీ | లు 21 | | త | | ర | | న | |
| త్తి | | వే 22 | త | నం | | ణ 23 | ర | వ | వి |

**పదరంగం-8కు సరైన జవాబులు పంపించినవారు**

1. గుండ్రాతి సుబ్రహ్మణ్యం-రాజంపేట
2. యం.వి.రమణకుమారి-హైదరాబాద్

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ..............................................

..............................................

ఊరు : ..............................................


ఈ వారం కా'ర్టూన్స్'


హ్యాపీ ఎలక్షన్స్ బోస్...!
Zakir...


నిజమైన సర్వే కావాలంటే ఐదు కోట్లు.. మీ పార్టీకి అనుకూలంగా ఉంటే యాభై కోట్లు!!
-పోల్ సర్వే-
Zakir...


క్లాస్‌రూం అనే రూంలో పిల్లలందర్నీ బంధించాలి.. గంటకో టీచర్ వచ్చి కాపలా కాస్తున్నారు మమ్మీ..!!
Zakir...

# ఫోటో ఫీచర్



కూబర్‌పెడీ అనే ఈ గ్రామం ఆస్ట్రేలియాలో ఉంది. ఇక్కడ ఇళ్లన్నీ పాతాళంలో ఉంటాయి. అత్యంత విలువైన ఓపల్ రత్నాలు దొరుకుతాయట ఈ గ్రామంలో. భూ గృహాలు ఎన్ని చోట్ల ఉన్నా ఇక్కడ ఉన్నట్లుగా మాత్రం ఉండవట. అత్యధిక ఎండలను తట్టుకోవడం కోసం ఇలా నిర్మించుకుంటారట. హోటళ్లు, ప్రార్థనా మందిరాలు ఇలా ప్రతీ నిర్మాణం నేలకు అడుగు భాగంలో ఉంటాయి.

